
దేవి పిల్సు REGD.
వాడండి ముఖ్యంగా అలస్యమైన్
ప్రేమముగాకాక పోయిన, బాధతో కూడిన.
లేక ఆగిపోయినబహిష్టకు

SEALED PACKING 28 & 14 TABLETS
AVAILABLE AT ALL CHEMISTS
Mfrs. SEENU & Co. MADRAS-21

SCIENCE has Solved the PROBLEMS
STOP GREY HAIR పిన్నవారుగా అగుపించండి. మీరు. పిన్న వారైనట్లే మీకు అనిపిస్తుంది (Feel)
Unobtainable anywhere else in the world. సంవత్సరాలుగా జరిపిన పరిశోధన ఫలితమైన బాల్ కాలా తేల్ BAL KALA TEL New Brilliantine Hair Colour అద్భుతముగ తెల్లజుట్టును శాశ్వతంగా వేళ్లనుంచి నల్లబడ్డట్లు చేస్తుంది 1 బుడ్డి 1కి 8/ only by M. O Advance 3 బుడ్లు Rs. 12/- by Money order Advance.
M/s. UNITED COMMERCIAL COY
House No 3884 (A.M.W/2/78)
Beat No. 32, Ambala Cantt. 133001(N.I)
Correspond in English




## పెద్దకథ ప్రారంభం

సిగిరెట్టు చివరి దమ్ము లాగి-దాన్ని కిటికీలోంచి బయటికి విసిరేసి, వాచీ చూసుకున్నాను.

తొమ్మిదీ నలభై అయిదు!

అంటే—

ఈపాటికి వాళ్లిద్దరూ బయల్దేరుంటారు.

వాకిట్లోకి వచ్చి నిలబడ్డాను.

వాళ్లిద్దరూ అప్పుడే మలుపు తిరిగి రోడ్డెక్కారు. పక్కవీధిలో వుంటున్నట్లున్నారు. రోజూ మా యింటిముందు నించే వెళ్తుంటారు.

ఇద్దరూ వుద్యోగం చేస్తున్నట్లున్నారు! ప్రతీ రోజూ శంకరమఠం దగ్గర బస్సు కోసం నాతోపాటు వాళ్లూ నిలబడతారు. ముగ్గురివీ వేరువేరు మార్గాలవడంచేత ఒకే బస్సులో ప్రయాణం చేయడం మాత్రం జరగలేదు.

వాళ్లిద్దరి దాంపత్యం చూస్తుంటే ఏంతో ముచ్చటగా వుంటుంది. వాళ్ల మాటల్లోను, నడవడిలోను కన్పించే అన్యోన్యత, అనురాగం ఎంతో అరుదుగా కనబడతాయ్! దాదాపు రెండు నెల్లనించీ వాళ్లని గమనిస్తూనే వున్నాను. తొమ్మిది ముప్పావు ప్రాంతంలో బయల్దేరి— నవ్వుతూ తుళ్ళుతూ బస్‌స్టాప్ చేరుకుంటారు. వాళ్ల వెనకే నేనూ బయల్దేరుతాను. ఆమె నవ్వుతూ బస్సెక్కేవరకూ అతను వేచి వుంటాడు.


ఆమె బస్సెక్కేప్పుడు గమనించాలి వాళ్లిద్దర్నీర్నీ! ఆ మొహాల్లో ఎంత బాధ, ఆవేదన, విరహావేదన!

—ఇంతలో అతని బస్సో, నా బస్సో రావడం— మేం విడిపోవడం జరుగుతుంది. ఆమె బస్సెక్కి వెళ్లిపోయే వరకూ వేచి వుండటం అతనోతోపాటు నాకూ అలవాటైపోయింది.

వాళ్లిద్దరూ మా యింటి ముందు కొచ్చారు.

గదికి తాళం వేసి నేనూ బల్దేరాను.

ప్రతీ రోజూ బయల్దేరగానే ముందు రూమ్‌కెదురుగా వున్న గడ్డియ్య కిళ్లీ



# కొత్త జీవితం

వేదగిరి రాంబాబు
మైనంపాటి భాస్కర్

కొట్టు దగ్గర ఆగి, ఒక ఫోర్ స్క్వేర్ పాకెట్ అందుకొని బయల్దేరడం అలవాటు. అతనికీ ప్రతిరోజూ ఇది అలవాటే కాబట్టి నన్ను చూడగానే ఫోర్ స్క్వేర్ పాకెట్ అందిచ్చాడు. దాన్నందుకుని, డబ్బులిచ్చి శంకరమఠంకేసి బయల్దేరాను.

ముందు వాళ్లిద్దరూ— వెనక నేను.

అతను లేత నీలంరంగు పాంటు, షర్టు వేసుకున్నాడు. ఆమె అదే రంగుచీర, బ్లౌజు వేసుకుంది!

అతను నవ్వుతూ ఏదో చెప్తున్నాడు. ఆమె చిరునవ్వుతో వింటోంది!

... మధ్య మధ్య ఆమేదో అంటోంది. ఆమె మాట్లాడినప్పుడల్లా అతను భళ్లున నవ్వేస్తున్నాడు!

వాళ్లేం మాట్లాడుకుంటున్నారో వినాలని నే నెప్పుడూ ప్రయత్నించలేదు. వాళ్లలా నవ్వుకుంటూ... తుళ్లుకుంటూ చిలకా గోరంకల్లా వెళ్తుంటే చూట్టానికెంతో ముచ్చటగా వుంటుంది. అందుకే వాళ్ల వెనకే బయల్దేరడమంటే నా కదో సర్దా!

ఆఫీసులకి వెళ్లేవాళ్లతోను; స్కూళ్లకీ, కాలేజీలకీ వెళ్లేవాళ్లతోనూ, రోడ్డు చాలా సందడిగా వుంది. అంతమందిలోనూ ఆ జంట ప్రత్యేకత కొట్టొచ్చినట్టు కన్పిస్తూనే వుంది!

బస్‌స్టాప్‌కి చేరుకునేసరికి అప్పటికేరెండు బస్సుల జనం నిలబడున్నారక్కడ. వాళ్లి ద్దరికి కొద్దిగా ఎడంగా నిలబడ్డాను.

మరో సిగరెట్టంటించాను కాలక్షేపం కోసం. ఈ అలవాటు నేను కాలేజీలో చేరిన కొత్తలో ఎప్పుడో మొదలైంది. అప్ప ట్నించీ... ఇలా వంటరితనంగా అన్పించి నప్పుడుకాని, చిరాగ్గా వున్నప్పుడుకాని సిగరెట్ తప్పకుండా వుండి తీరాలి. సిగరెట్టే నాకు మంచి మిత్రుడు.

చుట్టూ జనమున్నారన్న ధ్యాసకూడా లేకుండా వాళ్లిద్దరూ సర్దాగా అలా మాట్లాడుకొంటూనే వున్నారు.

—వాళ్లిద్దరూ ఒకళ్ల మరొకళ్ళకోసం సృష్టించబడ్డారు. అన్ని విధాలా కన్పోయే భార్య దొరకడం అతని అదృష్టం! మగవాడి జీవితంలో పెద్ద అదృష్టం అతన్ని పూర్తిగా అర్థంచేసుకొని, అభిమానంతో మెల్గే భాగస్వామి లభించడమేనని నా వుద్దేశం. అట్లాంటి దంపతులు తామానం దాన్ని పొందడమే కాకుండా చూసేవాళ్ళ క్కూడా ఎంతో వుల్లాసాన్ని కల్గిస్తారు.

మూడో నెంబరు బస్సు వచ్చింది.

అక్కడున్న జనంలో మూడో వంతు పైనే ఆ బస్సుమీద కెగబడ్డారు. ఆమె అతని చేతిని సున్నితంగా నొక్కి వదిలి తనూ బస్సువేపు కదిలింది.

బస్సెక్కబోతూ ఆమె అతనివేపు చూసిన చూపులో ఎంతో దిగులు, బాధ! అంతే దిగులు, బాధ అతనామెని చూసే చూపుల్లోనూ వున్నాయ్!

ఇంతలో నే నెక్కాల్సిన బస్సురావడంతో చేతిలోనున్న సిగరెట్టుని పారేసి, ఆలోచన్లకి తాత్కాలికంగా స్వస్తిచెప్పి, అటువేపు పరు గెత్తాను.

బస్సు నిండిపోయింది. మనిషి మీద మనిషితో. చాలా చికాగ్గా వుంది. ఇలా ప్రయాణంచేసి వెళ్లి ఆఫీసులో పని చేయా లంటే అదో పెద్ద శిక్ష! కానీ తప్పదు. నా లాంటి మధ్యతరగతి మనిషి రోజూ ఆటో ల్లోనూ, రిక్షాల్లోనూ తిరగలేడు. ఎంత నరకమైనా బస్సేగతి. లేకపోతే నడక! ఈ జంట నగరాల్లో ఇల్లు దొరకడమే పెద్ద సమస్య. అటువంటిది ఆఫీసుకి దగ్గ ర్లోనే ఇల్లు దొరకాలంటే చాలా కష్టం.

ఒకచోట్నించి మరోచోటికి వెళ్లాలంటేనే మైళ్లకి మైళ్లు దూరాలు.

బస్సు ప్రతీ స్టాప్‌లోనూ ఆగుతోంది, బయల్దేరుతోంది.

దిగేవాళ్లిద్దరు ముగ్గురుకన్నా వుండటం లేదు. ఎక్కేవాళ్లు ప్రతిస్టాప్‌లోనూ కనీసం పదిమందైనా వుంటున్నారు! ఆఫీసులకెళ్లే వాళ్లతోను; స్కూళ్లకీ, కాలేజీలకీ, వెళ్లే వాళ్లతోనూ ఈ సమయంలోనూ, సాయంత్రం ప్రతిరోజా బస్సులింతే!

ఆ ఇరుకులోంచే అభిమన్యుడు పద్మవ్యూహంలోకి చొచ్చుకు పోయినట్లు చొచ్చుకుపోయి టికెట్లిస్తున్నాడు కండక్టర్!

నడుస్తున్న నరకం! బస్సు బషీర్‌బాగ్ చేరుకొంది సగంమంది దిగిపోయారు. నేనూ దిగాను. ముందు వించీ శశిరేఖ, ప్రసాద్ దిగారు. వాళ్లిద్దరూ మా ఆఫీసులోనే పని చేస్తారు. నారాయణ గూడాలో ఇల్లు.

'వాళ్లిద్దర్నీ' ప్రతిరోజా బస్సెక్కాక ముందెలా చూస్తుంటానో, 'వీళ్లిద్దర్నీ' బషీర్‌బాగ్‌లో బస్సు దిగింది మొదలు తిరిగి సాయంత్రం బస్సెక్కేవరకూ అలానే చూస్తుంటాను.

రెండు జంటలూ భార్యా భర్తలే రెండు జంటలవీ దాదాపు ఒకే వయసు! అయినా రెండు జంటల మధ్యా ఎంత వ్యత్యాసం!

వాళ్లు ఒకళ్లని విడిచి మరొకళ్లుంటానికి తల్లడిల్లిపోతుంటారు. వీళ్లు ఒకళ్లతో పాటు మరొకళ్లు ఇంటిదగ్గరే కాకుండా ఆఫీసులో కూడా కల్సివుండాల్సొస్తోందే అని తల్లడిల్లి పోతున్నట్లుంటారు!

వాళ్లిద్దరూ హుషారుగానైనా పోట్లాడుకోటం చూళ్లేదు. వీళ్లిద్దరూ నవ్వుతూ—తృప్తిగా మాట్లాడుకోవడం చూడలేదు.

వాళ్లిద్దరికీ ఒకళ్ల మాటంటే మరొకళ్ళకి వేదవాక్కు. మరి వీళ్ళు — అతను మాట్లాడితేనే వణికిపోతుందామె, ఆమె మాట్లాడితేనే చిదరించుకుంటాడతను.

ఈ రెండు జంటల మధ్యా ఈ వ్యత్యాసానికి కారణం ?— ఇది నా కర్థంకాని ప్రశ్నై కూర్చుంది.

వాళ్లిద్దరూ—పక్కన మరో మనిషున్నాడన్న ధ్యాస కూడా లేకుండా ఎవరి ఆలోచనల్లో వాళ్లు నడుస్తున్నారు. వాళ్ల వెనకే నేను నడుస్తున్నాను.

# కొత్త జీవితం

కొంతమంది ఆనందంలో కన్నా దుఃఖంలోనే ఎక్కువ తృప్తిని పొందుతూంటారు. అలాగే వీళ్లిద్దరుకూడా సఖ్యతగా వుండటంకన్నా— ఇలా ఎడమొహం, పెడమొహంగా మెలగడమే ఆనందమేమో!

ఆఫీసుకి చేరుకున్నాం అక్కడ ఏమాత్రం మార్పులేని ఆఫీస్ పని మా కోసం ఎదురు చూస్తోంది. ఎవరి పనుల్లో వాళ్లం పడిపోయేం...

సాయంత్రం అయిదున్నరైంది. సీట్లోంచి లేచాను.

> *అంకితం!*
>
> కళ్ళు—
> మూసుకోవటానిక్కాదు;
> చూట్టానికే!
> బతుకు —
> ముడుచుకోవటానిక్కాదు;
> ఎగరటానికే!
> దీపం—
> చావడానిక్కాదు;
> వెలగడానికే!
> అలాగే—గీతంకూడా!
> గీతం—
> నిద్ర పుచ్చడానిక్కాదు;
> మేల్కొలపటానికే!!
>
> — నందిని సిధారెడ్డి.

శశిరేఖ ఇంకా ఏదో రాస్తోంది! టైమైపోయింది ఇంటికి వెళ్దాం అనే ధ్యాస ఆమెలో ఎక్కడా లేదు.

అవును పాపం! ఇంటికన్న ఆఫీసే ఆమెకెక్కువానందాన్నిస్తోందేమో!

"అయిదున్నరైపోయింది. ఇంకా ఏంటీ సీరియస్‌గా రాసేస్తున్నారు" ఆమె సీటు దగ్గర కెళ్లాను.

"అబ్బే! ఏంలేదండి. ఈ స్టేట్‌మెంట్ కాస్త చూసి వెళ్దామని..."

"అయిదున్నరైపోయిం తర్వాత కూడా ఇంకా వాటితో కుస్తీ పట్టడానికి మీ కెంత ఓపికండి" చిన్నగా నవ్వాను.

ఆమె నవ్వింది.

"ఇంక బయల్దేరుతావా?" తీవ్రతతో కూడిన కంఠం విన్పించేసరికి ఇద్దరం అటు చూశాం.

ఎప్పుడొచ్చాడో ప్రసాద్ గుమ్మం దగ్గర నిలబడున్నాడు. అతని మాటల్లోనే కాదు చేతలో కూడా తీక్షణత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది అతని ఆ ప్రవర్తన మామూలే అయినా మరో వ్యక్తి ముందు భార్యనలా అనేసరికి వళు మండింది. అయినా నేనేం చేయగల్ను? అసహ్యంతో చూపు అతనివేపు నించి పక్కకి మరల్చాను

అతని కోపాన్ని పసిగట్టి మౌనంగా చేతిలోని ఫైల్ని డ్రాయరు సొరుగులో పడేసి, దానికి తాళంవేసి నిల్చింది శశిరేఖ.

ఆమె అవస్థని గమనించి, వస్తాననిచెప్పి గబగబా బయటికొచ్చేశాను.

ఆఫీసైపోగానే ఏదో హోటల్లో కాఫీ తాగి కాసేపలా... అలా తిరిగి దాదాపు ఏడు గంటల ప్రాంతంలో రూమ్‌కి చేరుకోవడం అలవాటు. ఓ సిగరెట్ వెలిగించి నెమ్మదిగా అబిడ్స్ వేపు బయలుదేరాను

భార్యాభర్తలకి పెద్ద శిక్షేమిటంటే శశిరేఖలాంటి దాంపత్యం. ఒకళ్ళు మనసు విప్పి మరొకళ్లతో మాట్లాడుకోలేరు. అతను చిటపట— ఆమె మౌనం! అటువంటి దాంపత్యం కన్నా అసలు పెళ్లే చేసుకోకపోవడం మంచిది.

తనకోసం ఆప్తులందర్నీ విడిచి వచ్చిన భార్య యెడల ప్రేమ చూపించలేని మనిషి మనిషేకాదు అలాగే భర్తంటే అభిమానం, ఆదరణ, గౌరవంలేని భార్య భార్యే కాదు. అసలు ఒకళ్ళంటె మరొకళ్లకి అభిమానం లేదు, కలగదు అనుకున్నప్పుడు పెళ్లెందుకు చేసుకుంటారు? ఒకవేళ చేసుకున్నారూ— అప్పుడు జీవితాంతం ఒకళ్ల సాహచర్యం, సానుభూతి మరొకళ్లకి కావాలని తెల్సికూడా సర్దుకుపోడానికెందుకు ప్రయత్నించరు?

నరకమంటే వేరేలేదు ఇటువంటి దాంపత్యమే!

శశిరేఖ, ప్రసాద్‌లు కన్పించినా; వాళ్ళ గురించి ఆలోచించినా అసలు పెళ్ళంటేనే విముఖత కల్గుతోంది.

హోటల్లో కాఫీతాగి— కోఠీకెళ్లే బస్సెక్కాను.

—శంకరం మఠం దగ్గర బస్సు దిగి, రూమ్‌కి బయల్దేరాను.

# కొత్త జీవితం

బ్రిడ్జిదగ్గర వాళ్లిద్దరూ ఎదురొచ్చారు. ఇదీ రోజూ మామూలే.

నేనిలా ఏడుగంటల ప్రాంతంలో రూమ్‌కి తిరిగొచ్చే సమయాన్కి– ఇద్దరూ కూరలు మొదలైనవి కొని కాసేపలా కులాసాగా తిరిగి రావడానికి బయల్దేరుతారు. కేవలం ఆఫీసు సమయంలోతప్ప మిగతా సమయమంతా ఇద్దరూ కల్సే కనబడతారు.

శశిరేఖ వాళ్ళ దాంపత్యం చూస్తుంటే ఎంత వైరాగ్యం కల్గుతుందో, వీళ్ల దాంపత్యం చూస్తుంటే అంత ముచ్చట కల్గుతుంది.

రూమ్‌కెళ్ళి స్నానంచేసి,కాసేపు కూర్చుని భోజనానికి బయల్దేరాను. దారిలో మళ్ళీ వాళ్లిద్దరూ తిరిగొస్తూ కన్పించారు.

ఇలా రోజూ ఈ జంట, ఆ జంట – రెండు జంటలూ కన్పిస్తూనే వున్నాయ్. నాకు తెలీకుండానే వాళ్లని ప్రతీరోజూ గమనిస్తూనే వున్నాను, నా లాంటి బ్రహ్మచారిలో ఆ రెండు జంటలూ ఓ విధమైన సంచలనాన్ని రేపాయంటే పెద్ద విచిత్రమేమీ కాదు!

పెళ్లి అనేది నిజంగానే నూరేళ్ళ పంట. ఒకళ్లనొకళ్ళు అర్థం చేసుకుని, సర్దుకుపోయే వాళ్ళైతే జీవితం ఆనందంగానే గడిచిపోతుంది. లేకపోతే శశిరేఖ, ప్రసాద్‌ల దాంపత్యంలాగానే... నరకం! పెళ్ళైన ఆ మనిషి ఉన్నతిగాని, పతనంగాని పూర్తిగా తమ తమ భాగస్వాముల మీదే ఆధారపడి వుంటుంది. అందుకనే పెళ్ళి చేసుకోబోయే ముందు ఆ అమ్మాయి మనస్తత్వాన్ని కొంతవరకైనా తెల్సుకొని, నాతో ఏకీభవిస్తుందనుకుంటే తప్ప పెళ్ళనేది చేసుకో కూడదని నిశ్చయించుకొన్నాను.

ఆ రోజు నేనాఫీసు నించి వచ్చేసరికి రెండుత్తరాలు వచ్చాయ్. ఒకటి పరిచయమైన దస్తూరే– నాన్నగార్ది. రెండవ దస్తూరీ కొత్తది! ముందు నాన్నగారు రాసిన ఉత్తరం చదివాను.

ఖాజీపేట వెళ్లి ఓ అమ్మాయిని చూసి వచ్చారట. ఆ పిల్ల అన్నివిధాలా నచ్చిందట. నాకు వీలైనంత త్వరలో ఖాజీపేట వెళ్ళి, ఆ అమ్మాయిని చూసి ఏ విషయం రాయాలట. నచ్చకపోతే వేరే సంబంధాలు చూస్తారట, నచ్చితే సాధ్యమైనంత త్వరలో ముహూర్తాలు పెట్టుకుంటారట!

పెళ్ళి!...పిల్ల!... వెంటనే నా మనసులో రెండు జంటలూ మెదిలాయ్.

రెండవ వుత్తరం తీసుకున్నాను.

రాజుగార్కి –

ఎవరా ఈ వుత్తరం రాస్తోందని మీరాశ్చర్యపడొచ్చు. నా పేరు మృణాళిని, మాది ఖాజీపేట ...

నాల్గురోజుల క్రితం నన్ను చూసి వెళ్లడాన్కి మీ అమ్మా నాన్నగార్లు వచ్చి వెళ్లారు మీరుకూడా నన్ను చూట్టానికి వస్తారని, మీక్కూడా నచ్చితే వెంటనే లగ్నాలు పెట్టుకుందామని మీ నాన్నగారు మా నాన్నగార్తో అన్నార్ట. అందుకే నే నీ వుత్తరం రాస్తున్నాను.

నాకు మొదట్నించీ వివాహమంటే కొన్ని అభిప్రాయాలున్నాయ్. అవి మీకు ముందే తెలియజేయడం మంచిదని నా వుద్దేశం. ఎందుకంటే– ఒకవేళ నేను మీకు నచ్చితే మనిద్దరం భార్యాభర్త లవుతాం. అంటే ఒకళ్ళ విషయంలో మరొకళ్ళం అర్ధ భాగస్వాము లవుతాం. రెండర్ధాలు ఒకటవ్వాలంటే రెండూ కలవాలి.

కట్నం తీసుకునే మగవాడంటే నాకసహ్యం. వాళ్ళు ఆడపిల్లల తల్లిదండ్రుల్దగ్గర్నించీ కట్నం పేరుతో డబ్బు గుంజి పీల్చి పిప్పిచేస్తున్నారనికాదు. తనక్కాబోయే భార్యని పోషించడాన్కి సరిపడా డబ్బు ఆమె తల్లిదండ్రుల్దగ్గర్నించీఅడుక్కుంటున్నారని. మీరే చెప్పండి–

నన్ను చూస్తారు. నేను మీకు నచ్చుతాను. కానీ మా నాన్నగారిచ్చే కట్నం నచ్చదు. అప్పుడు వేరే సంబంధం చూసుకుంటారు. అంటే– అక్కడ పెళ్ళికి ముఖ్యం పిల్ల కాదన్నమాట. డబ్బు!


ఒకళ్ల భావాల్తో మరొకళ్ళు ఏకీభవించే వాళ్ళైతేనే ఆ దంపతుల జీవితాలు ఆనందంగా గడిచిపోతాయ్. లేకపోతే పెళ్లైన మర్నాటినుంచే ఎడమొహం, పెడమొహం! ఒకళ్లని చూస్తే మరొకళ్లకి చిటపటలు, పటపటలు! పెళ్లైన తర్వాత ఆ మనిషి ఉన్నతిగాని; పతనంగానీ తమ భాగస్వామి మీదే ఆధారపడి వుంటుంది. అందుకే పెళ్లి చేసుకోబోయే ముందే ఒకరి ఇష్టాలు మరొకరు తెల్సుకుని. రెండోవాళ్లతో ఏకీభవిస్తామనుకున్నప్పుడే ముందుకు పోవాలి... ఈపాటికి నా అభిప్రాయాలు– పెళ్లి విషయంలో – మీ కర్ధమయ్యే వుంటాయనుకుంటాను. అటువంటి, భర్త లభించినప్పుడు అతనికి మనోవాక్కాయ కర్మలా దాసోహమనడంకన్నా ఆనందం మరొకటి లేదు.

మీరు కట్నం తీసుకోనని, ఎదుటి వ్యక్తిని అర్థం చేసుకొని దాంపత్యం నెరపడాన్కి ప్రయత్నిస్తానని అనుకుంటేనే పెళ్లి చూపులకి రండి. లేకపోతే వద్దు! అనవసరంగా చార్జీలు దండుగ, మాకు లేనిపోని ఆశ!

నన్నర్థం చేసుకుంటారనుకుంటాను...

మృణాళిని.

ఆశ్చర్యంతో చాలాసేపు అలాగే వుండి



పోయాను. ఒక ఆడపిల్ల ఇంత ధైర్యంగా ఇలా రాయగల్గుతుందని ఇంత వరకూ ఊహించలేదు!

ఎంత ధైర్యం—!

చాలా సేపు ఆ ఆశ్చర్యాన్నించీ తేరుకోలేక పోయాను. సిగరెట్టు తర్వాత సిగిరెట్టు వెల్గించి ఆలోచిస్తూ అలాగే వుండి పోయాను.

మృణాళిని వుత్తరం ముందాశ్చర్యాన్ని కల్గించినా' తర్వాతాలోచించిన కొద్దీ ఆమె అంటే ఓ విధమైన ఆకర్షణ కల్గసాగింది.

పెళ్లంటే నాకున్నట్టే ఆమెకీ కొన్ని అభిప్రాయాలున్నాయ్. కాబోయే భర్తకా విషయాలు తెల్పియాలనుకుంది, రాసింది. అంతే! దాంట్లో తప్పు పట్టాల్సిందే కన్పించలేదు.

ఫ్రాంక్‌గా వుండే మనుషులంటే నా కెంతో ఇష్టం. ఆమె వ్యక్తిత్వం నన్నెంతగానో ఆకర్షించింది. వెంటనే వచ్చే ఆదివారం ఖాజీపేట వెళ్తున్నానని, ఆ విషయం వాళ్లకి తెలియజేయమని నాన్నగారికి వుత్తరం రాశాను.

ఆ రాత్రి, సరిగా నిద్రపట్టలేదు.

'వాళ్ళిద్దరి' లాగానే నేను, మృణాళిని — ఎంతో అన్యోన్యంగా కాపురం చేస్తున్నట్లు రకరకాల కలలు రాసాగాయి.

ఆదివారం ఎప్పుడొస్తుందా, ఆమె నెప్పుడు చూస్తానా అనే ఆతృత క్షణ క్షణానికి నాలో అధిక మవుతోంది.

ఆదివారం రానే వచ్చింది. మధ్యాహ్నం గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరాను.

...మరికొద్ది సేపట్లో మృణాళిన్ని చూస్తున్నాను. అంతకుముందే ఆమె అంటే వో అభిప్రాయం కల్గడంతో ఆ ఆలోచనే వో వింత అనుభూతిని కల్గిస్తోంది. ప్రయాణంలో అంతా ఆమె గురించే ఆలోచన్లు!

ఖాజీపేటలో బండి దిగి రిక్షాలో సరాసరి అడ్రసు వెదుక్కుంటూ బయల్దేరాను. ఇంటిని తేలిగ్గానే కనుక్కో గల్గాను.

ఆ ఇంటిముందు వో నడివయస్కుడు నిల్చునున్నాడు. అయవటువచ్చే వాళ్ళందర్నీ నిశితంగా పరిశీలిస్తున్నాడు. నేను రిక్షా దిగడం గమనించగానే—

"రండి..." గబగబా ముందుకొచ్చాడు.

ఆయన బహుశా మృణాళిని నాన్నగారై వుంటారనుకున్నాను.

"నాపేరు రాజు!" పరిచయం చేసు కొన్నాను.

"నాపేరు నిరంజనం" ఆయన పరిచయం చేసుకొన్నారు తన్ని.

అయితే నా ఊహ కరక్టేనన్నమాట! కాబోయే మామగారు. నమస్కరించాను.

"నమస్కారం! రండి..." ఆయన లోపలికి దారితీశారు. ఆయన వెనకే నేనూ లోపలికి బయల్దేరాను.

ఇంట్లో వాళ్లంతా నాకోసమే ఎదురు చూస్తున్నట్లున్నారు. నన్ను చూడగానే ఎటువాళ్లటు సర్దుకున్నారు.

ఓ పదిహేనేళ్ల కుర్రాడు మాత్రం అక్కడే హాల్లో నుంచున్నాడు.

"వీడు మా పెద్దబ్బాయ్— రవిబాబు! టెన్త్ క్లాస్ చదువుతున్నాడు" అతడ్ని పరిచయం చేసారు నిరంజనంగారు.

"నమస్కారమండి" వినమ్రంగా నమస్కరించాడతను. ప్రతినమస్కారంచేశాను

హాల్లో కుర్చీలు చాలా నీట్‌గా సర్దున్నాయ్.

### దొంగ రవాణా రాజధాని

75 లక్షలమంది ప్రజలు వున్న బొంబాయి మనదేశంలో దొంగ రవాణాకి రాజధానిగా తయారైంది. దొంగరవాణాకు స్థావరమైన గుజరాత్ నుంచి కేరళ పశ్చిమతీరానికి బొంబాయి ముఖ్యకేంద్రమైనదని కేంద్రంలోని ఆర్థిక సహాయమంత్రి జనవరి 21వ తేదీన బొంబాయిలో చెప్పారు.

దొంగరవాణాదారులనుండి 5కోట్ల రూపాయల విలువగల ఆస్తిని స్వాధీనం చేసుకోటానికి ప్రభుత్వం ఆజ్ఞలను జారి చేసింది. దీనిలో ఒక్క బొంబాయి లోనే 3కోట్ల ఆస్తివుంది. బొంబాయి శాంతాక్రజ్ విమానాశ్రయంలోజరిగిన ఒక దాడిలో 60 లక్షల రూపాయల విలువగల వజ్రాలు, రెండవ దాడిలో 55 లక్షల విలువగల వజ్రాలు పట్టుబడ్డాయి.

నిరంజనంగారు, నేను కూర్చున్నాం.

రవి మంచినీళ్లు తెచ్చిచ్చాడు.

"మాకు ఒకబ్బాయ్, ఇద్దరమ్మాయిలు. ఇప్పుడీ అమ్మాయి— మృణాళిని పెద్దది. ఇంటర్ పాసయింది. తర్వాత వీడు! చిన్నమ్మాయి మయూరి థర్డ్‌ఫారం చదువు తోంది..." తమ కుటుంబ వివరాలు చెప్పారాయన.

చిన్నగా నవ్వి వూరుకున్నాను.

ఇంతలో లోపలికెళ్లి రెండు టిఫిన్ ప్లేట్లు తీసుకొచ్చి మా కెదురుగా వున్న టీపాయ్‌మీద పెట్టి బయటికెళ్లిపోయాడు రవి.

కబుర్లు చెప్పుకుంటూ టిఫిన్ పూర్తి చేశాం.

ఆయనతో కబుర్లు చెప్తున్నానన్నమాటే గాని నా చూపులు మృణాళి వెక్కడైనా కన్పడుతుందేమోనని వెదుకుతూనేవున్నాయ్ టిఫిన్ పూర్తైంతర్వాత కాఫీ కప్పుల్తో ప్రత్యక్షమైంది మృణాళిని!

కొన్ని క్షణాలు ఆమెకేసి అలాగేచూశాను అందగత్తే నా చూపు లామె కిబ్బంది కల్గించినట్లున్నాయ్. తలదించుకొంది. నా ప్రవర్తన నాకే సిగ్గనిపించింది.

"కూర్చోండి..." ఎదురుగావున్న కుర్చీ చూపించాను.

తలవంచుకుని ఆమె అలాగే నిరంజనం గారి పక్కనే నిలబడింది.

"ఫర్వాలేదు కూర్చో అమ్మా..." నిరంజనంగారు కూడా అనడంతో కూర్చుంది.

ఆమె అమాయకత్వంతో కూడిన అందం నన్ను పిచ్చివాడ్ని చేస్తోంది. ఆమెతో మాట్లాడకుండా కూర్చోవడం. నా వల్ల కావడంలేదు.

"మీ పేరు...?" ఏదో ఒకటి ఆమెని పల్కరించాలనే వుద్దేశంతో అడిగాను.

"మృణాళిని"

"మీ రింటరు పాసయ్యారు కదా! ఇంకా పైకి చదవాలను కోవడంలేదా?"

"అది చదువుతాననే అంటోందండి. కానీ మా ఆతృత మాది. పెళ్ళైన తర్వాత దానికి చదవా నుంటే, అతనికి చదివించాలనుంటే అప్పుడు చదువుకో వచ్చుగా..." మా మాటల మధ్య అడ్డు వస్తూ అన్నారు నిరంజన్‌గారు.



# కొత్త జీవితం

"నిజమే ననుకోండి..." నసిగాను. ఇంకేమన్నా ?"

గొంతు బాగున్న వాళ్ళందంగా వుండరనే అభిప్రాయం నాకుంది. కానీ మృణాళిని నా అభిప్రాయాన్ని తల్లక్రిందులు చేసింది. ఆమె మాట్లాడుతూంటేనే ఎంతో వినసొంపుగా వుంది. చూస్తుంటే మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే అందం, వింటుంటే మరీ మరీ వినాలనిపించే గొంతు – ఆమెది! తప్పకుండా ఆమెకి సంగీతంలో పరిచయం వుండి తీరాలనిపిస్తోంది – ఆమె గొంతు వింటుంటే ఆ మాటే అడిగేశాను.

మ్యూజిక్ డిప్లొమా పరీక్షలు మొన్నీ మధ్యనే ఇచ్చిందని చెప్పారు నిరంజన్‌గారు. ఇంకా ఏం మాట్లాడాలి? ఆలోచిస్తున్నాను.

"ఇప్పుడే వస్తా మాట్లాడుకుంటూ వుండండి" లోపలి కెళ్ళారు నిరంజనంగారు.

హాల్లో నేను, మృణాళిని!

ఆమెతో ఏమేమో మాట్లాడాలి...ఏదేదో చెప్పాలి... కానీ పెదాలు విడివడ్డంలేదు.

మృణాళిన్ని చూసి నప్పట్నించీ నాలో వచ్చిన మార్పుని నిరంజనంగారు గమనించే వుంటారు. బహుశా మా ఇద్దర్నీ కాసేపు వంటరిగా వదలాలనే ఆయన లోపలి కెళ్ళుంటారు, ఆయనొచ్చేలోపే ఆమెతో మాట్లాడేసేయాలి...

"మృణాళినిగారూ..." పిల్చాను.

ఏంటన్నట్లు చూసింది.

"మీరు మరేమీ అనుకోబోతే..."

"అనుకోను చెప్పండి" చిన్నగా నవ్వింది.

ఆమె నవ్వుతూంటే అందం మరింత విజృంభిస్తోంది. ఆమె నా భార్య కాబోతోంది! మనసానందంతో తేలిపోతోంది.

"మరేమీ లేదు మీరు నాకు నచ్చారు ... మీకు నేను నచ్చానో లేదోనని ..." ఏదో మాట్లాడాలనుకున్నాను మరేదో మాట్లాడేస్తున్నాను.

నేనలా అడిగేస్తానని ఆమె వూహించి వుండదు జవాబు చెప్పలేక తికమక పడింది.

తల వంచుకుని కూర్చుంది, ఆమె మొహంలో తృప్తితో కూడిన సిగ్గు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

కాసేపు నిశ్శబ్దం—

టైమ్ గడచిపోతోంది. మళ్ళీ నిరంజనంగారు వచ్చేయవచ్చు. అర్జంటుగా మాట్లాడేయాలి...

"మీతో కొన్ని విషయాలు మాట్లాడాలి."

"చెప్పండి" మళ్ళీ నవ్వింది.

"ఇక్కడ కాదు వంటరిగా..." తడబడ్డాను.

"ఇప్పుడు మనం వంటరిగానేఉన్నాంగా"

ఆమె అందం, నడవడి నన్ను పూర్తిగా సంతృప్తుడ్ని చేశాయి. అందుకే అర్జంటుగా కొన్ని విషయా లామెతో మాట్లాడేసేయాలి. ఆతృత పెరిగి పోతోంది.

"కొంచెం సేపట్లో నే నిక్కడ్నించీ వెళ్ళిపోతాను.ఇక్కడ్నించీ సరాసరి స్టేషన్ కెళ్తాను. మీరో అరగంట పోయిం తర్వాత ఇంట్లో ఏదో కారణం చెప్పి అక్కడికొచ్చారంటే మీతో కొన్ని విషయాలు మాట్లాడాలి" గబగబా అనేశాను.

ఆమె మొహంలో రంగులు మారాయి.

"అమ్మో! నేనాను" తుళ్ళిపడుతూ అందామె.

నాలోనూ తొట్రుపాటు పెరిగింది.

"అబ్బే! ఎంతోసేపుకాదు. కొద్దినిముషాలు" తొట్రుపాటును కప్పిపుచ్చుకుంటూ అన్నాను

"ఉహూఁ! నేన్రాలేను. క్షమించండి. మీరు నన్ను చూట్టానికి వచ్చారు.చూశారు ఏదైనా మాట్లాడాలనుంటే ఇక్కడే మాట్లాడండి. మీరలా రమ్మనడం మాత్రం బాగోలేదు. నా అభిప్రాయాలు మీకు ముందే తెలియజేశాను. మీరే ఆలోచించుకొని నిర్ణయానికి రండి వస్తాను" చటుక్కున లేచి లోపలికెళ్ళిపోయింది.

ఆమె అలా మాట్లాడేసరికి సిగ్గేసింది. కుంచించుకుపోయాను. ఇంతలో నిరంజనంగారక్కడికి వచ్చారు. కాసేపాయన్తో మాట్లాడి శలవు తీసుకుని బయల్దేరాను.

*        *        *

హైద్రాబాద్ చేరుకునే వరకూ దారి పొడుగునా మృణాళిని గురించే ఆలోచన్లు—

హైద్రాబాద్ చేరుకోగానే— ఆ పిల్ల నచ్చిందని ముహూర్తాలు పెట్టుకోమని నాన్నగార్కి రాశాను. నా తర్వాత పెళ్ళి చేయాల్సిన ఆడపిల్లల్లేరు, మరితర బాధ్యతలేవీ లేవు కాబట్టి దయచేసి వాళ్ళ దగ్గర కట్నం ప్రసక్తి తేవద్దని కూడా రాశాను.

(ఇంకా వుంది)

# కొత్త జీవితం

వేదగిరి రాంబాబు * మైనంపాటి భాస్కర్



*(గత సంచిక తరువాయి)*

ఎంతోమంది, బంధువుల, స్నేహితుల సమక్షంలో బ్రహ్మాండంగా జరిగి పోయింది ముహూర్తం. ఇంక వేడుకలు మొదలయ్యాయి.

పానకపుబిందెలో ఒక బంగారపు ఉంగరము, వెండిమట్టెవేసి మమ్మల్ని తీయమన్నారు.

ఎదురెదురుగా కూర్చున్నాం నేను మృణాళిని.

రెండురోజుల పెళ్ళితంతులో డస్సిపోయి, నిద్రలేమికి కళ్ళు ఎర్రబడి అదో విధమైన అందంతో వుంది మృణాళిని. తలంటు పోసుకొని మానేరాయని జుట్టు వదులొదులుగా మొహమ్మీద పడుతోంది తలమీద అక్కడక్కడా తలంబ్రాలు, అక్షింతలు ఇంకా కొద్దిగా మిగిలేవున్నాయ్. కట్టుకున్న మధుపర్కాలమీద పసుపు, కుంకుమ తేలిగ్గా అతుక్కొనున్నాయ్.

'ఇప్పుడీమె నాసొత్తు!' అలా తృప్తిగా ఆమెను చూస్తూ అనుకోవడం అదెన్నోసారో!

మా చుట్టూ బోలెడు మంది చేరి తమాషా చూస్తున్నారు.

"అమ్మాయ్! నీ గోళ్ళు పొడుగ్గా వున్నాయ్. బిందెలో చెయ్యి పెట్టగానే అబ్బాయిని గిల్లకూడదు" నవ్వుతూ అందొక పెద్ద ముత్తైదు.

మృణాళిని సిగ్గుపడిపోయింది.

"బావగారూ! మా అక్క చేతులు బాగా సున్నితంగా వుంటాయి జాగ్రత్త. మీ బలమంతా ఆ చేతులమీదుపయోగిస్తే అవి కందిపోతాయ్" చిరునవ్వుతో అంది మృణాళిని చెల్లెలు మయూరి — వెంటనే వాళ్ళక్క తరపున వకాల్తా పుచ్చుకుని

ఇంతలో "కాస్త జరగండి ··· కాస్త జరగండి"... అంటూ అందర్నీ తోసుకుంటూ ముందుకొచ్చారు సూర్యనారాయణగారు. ఆయన మృణాళిని పినతండ్రి. ఆయన చేతిలో కెమేరా, ఫ్లాష్ వున్నాయ్. పెళ్ళిలో మిగతా పెత్తనం మాటటుంచి, తనదగ్గర కెమేరా వుండటంతో ఫొటోలు తీసే హడావిడంతా ఆయన తీసుకున్నారు. పెళ్ళితంతు మొదలైనప్పట్నించీ ఛడామడా నిముషానికొక స్నాప్ చొప్పునలాగేస్తున్నారు!

"మీ రిద్దరూ నేను రెడీ అనే దాకా బిందెలో చేతులు పెట్టకండి" వార్నింగిచ్చి పట్లుగా అన్నారాయన.

ఇంతలో "నువ్వు పక్కకి తప్పుకో..."! తోసుకుంటూ వచ్చారు సుందర్రామయ్యగారు. ఈయనా మృణాళినికేదో దగ్గర బంధువేనట. ఈయన ఫొటోలు తీసే డ్యూటీ మీదే వున్నాడు! అయితే ఒకటే తేడా! సూర్యనారాయణగారు బ్లాక్ అండ్ వైట్ ఫొటోలు తీస్తే, ఈయన కలర్ ఫొటోలు తీస్తున్నాడు– ముఖ్యమైన ఘట్టాల్లో మాత్రమే! అందుకని ఈయన విలువ మరీ ఎక్కువ. పైగా టీచరు. అందుకని కోప్పడి మరీ ఫొటోలు తీయసాగాడు.

"ఇంత రసవత్తర ఘట్టంలో సాదా ఫొటో ఏంటండీ? కలర్ ఫొటో తీద్దాం. మీరు జరగండటు..." అంటూ సూర్యనారాయణగార్ని పక్కకి తోసి తను సర్దుకున్నారా స్థలంలో సుందర్రామయ్యగారు.

సూర్యనారాయణగారు బిక్కమొహంవేసి "బ్రహ్మాండమైన యాంగిల్సన్నీ మీరే తీసేస్తున్నారు. మరి నేనేమైపోవాలి? మనిద్దరికీ పోటీవద్దు. మీరూ తీయండి, నేనూ తీస్తాను" అన్నారు నలుపు తెలుపులో అయితేనేమి ఫొటోలు తీయడంలో నా సమర్ధత నిరుపించుకుంటానన్న ధోరణిలో.

"ఎందుకండీ ఫిలుం దండుగ... పోనీ ఒకపని చెయ్యండి బంగారపుటుంగరం తీసి గెల్చినవాళ్ల మొహం రంగుల్లో నేను తీస్తాను వెండి మట్టె తీసి వోడినవాళ్ల మొహం నలుపు తెలుపులో మీరు తీయండి" అన్నారు సుందర్రామయ్యగారు వెటకారంగా. తెల్లటి సూర్యనారాయణగారి మొహం నల్లగా మాడిపోయింది.

అందరూ గొల్లున నవ్వారు.

"వాళ్లిద్దరి పోట్లాట తెగదర్రా! మీ రిద్దరూ కానివ్వండి, బంగారపుటుంగరం తీసినవాళ్లు గెల్చినట్లు రెడీ...వన్... టు...త్రీ..." అన్నారెవరో.

చటుక్కున ఇద్దరం ఒకేసారి బిందెలో చెయ్యి పెట్టాలని చూశాం. ఆ విసురులో మృణాళిని చేతికున్న బంగారు గాజులు నా చేతికి ఒరుసుకున్నాయ్.

'సారీ!' అన్నట్టు చూసిందామె నావంక బాధగా.

### ఉజ్బెక్ భాషలో "భారతీయ కథా సంకలనం"

"భారతీయ కథా సంకలనం" ఉజ్బెక్ భాషలో 60 వేల ప్రతులలో సచిత్రంగా ప్రచురించబడింది.

వివిధ భారతీయ భాషలకు చెందిన 30 మందికి పైగా రచయితలు రాసిన కథానికలు యీ సంకలనంలో వున్నాయి. దీనిలో ఉజ్బెకిస్తాన్‌కు తమ రచనల ద్వారా చిరపరిచితులయిన ప్రేమ్‌చంద్, యశపాల్, కె. వి. అబ్బాస్, అమృతప్రీతం కథలు సైతం వున్నాయి. ఎక్కువభాగం కథలు అంతకు ముందు ఉజ్బెక్ భాషలో అనువదించబడని రచయితలు రాసినవి.

తాష్కెంట్ విశ్వవిద్యాలయం ప్రాచ్యభాషా విభాగంలో పట్టభద్రుడు అయిన అమీర్ ఫెయిజుల్లాయేవ్, అన్సారుద్దీన్ ఇబ్రగిమోవ్ యీ కథా సంకలనాన్ని కూర్చారు. భారతీయ జీవితం గురించి, భారతదేశం ఎదుర్కొంటున్న సమస్యల గురించి పాఠకునికి సమగ్రమైన చిత్రాన్ని అందించే కథలను వారు యేర్చి కూర్చారు.

ఈ కథలన్నీ ఉజ్బెక్‌భాషలోకి అనువదించడం యిదే తొలి పర్యాయం.

## కొత్త జీవితం

చెయ్యి బిందెలో పెట్టీ పెట్టగానే ఉంగరం దొరికింది నాకు. మృణాళిని ఇంకా తడుముతూనే వుంది.

'పాపం!' జాలేసింది.

'ఆడపిల్ల చిన్నబుచ్చుకుంటుందేమో!' సానుభూతి కల్గింది.

'తన చేతికే అందించేద్దాం పోనీ!' అనే ఔదార్యం కూడా కల్గింది.

కానీ ఆఅమ్మాయి నాలా ఇంత పరోపకార బుద్ధితో ఆలోచిస్తున్నట్లులేదు. తన పొడుగాటివేళ్ళతో చటుక్కున తేలుపిల్లలా గిల్లింది.

'అమ్మో!' అనబోయి ఆపుకున్నాను.

మృణాళిని మొహంలోకి చూశాను.

ఏమీ ఎరగనట్టు తలవంచుకు నే కూర్చుంది. తనచెయ్యిమాత్రం నా గుప్పెడు సడలించాలని ప్రయత్నిస్తోంది.

'ఓహో... అదా! ఉంగరం, ఇచ్చేయమంటావా! నువ్వడక్కపోయినా నేనే ఇచ్చేవాణ్ని డియర్...' అనుకుంటూ నా చేతిలో వున్న ఉంగరం ఆమెకిచ్చాను.

ఆమె దాన్నందుకొని తన చేతిలోవున్న మట్టె నాచేతిలోపెట్టి గుప్పెడు మూసింది.

చేతులు బయటికి తీశాం.

కెమేరాలు క్లిక్‌మన్నాయ్. ఫ్లాష్‌లుజిగేలుమన్నాయ్ అందరూ ఆత్రంగా చూడసాగారు!

నాచేతిలో బంగారపుటుంగరం, ఆమె చేతిలో వెండిమట్టె! మెట్టె కొద్దిగా నగిషీ పని చేయబడి ఉంగరం ఆకారంతో వుండటంతో పొరబడ్డాను. నేను మొదట తీసుకున్నది మెట్టె అన్నమాట! ఉంగరమనుకున్నాను మూర్ఖుణ్ణి ...

అంటే—తనకుంగరం దొరికినా నాకిచ్చేసిందన్నమాట! అప్పుడే నేనంటే ఎంతభిమానం!

ఆ తర్వాత బూజంబంతి.

అందరిసమక్షంలో, ఆడబడుచులాలులు పట్టిస్తుంటే మొదటిసారిగా ఒకళ్ళఎంగిలి మరొకళ్ళం తిన్నాం. అదోచక్కటి అనుభూతి!

ఇలా ఎన్నో చక్కటి అనుభూతులమధ్య ఎటువంటి గొడవలూలేకుండా ఎంతో ముచ్చటగా జరిగిపోయింది పెళ్ళి. పెళ్ళికొచ్చిన వాళ్ళల్లో అధికభాగం కుర్రకారు కావడం వల్లే అంత చక్కగా జరిగింది.

అప్పగింతలు ప్రారంభమయ్యాయి.

అంతవరకూ ఎంతో సర్దాగా గడిచిపోతుంది పెళ్ళి. అక్కడికొచ్చేసరికి అందరి మనసులూ బరువెక్కిపోతాయ్!

నిజమేమరి! అంతవరకూ ఎన్నో కష్టాలకోర్చి పెంచి పెద్దచేసిన పిల్ల పరుల సొత్తైపోతోంది. వాళ్ళతోనే వెళ్ళిపోతుంది ...

— ఈ ఆలోచన్లు ఏ కన్నతల్లిదండ్రుల్ని తోబుట్టువుల్ని కదిలించదు? గమ్మత్తేమిటంటే అప్పగింతలుజరిగేటప్పుడుమేళగాళ్ళు పాట వాయిస్తుంటే ఆడపిల్ల తరపు వాళ్ళకేకాకుండా అక్కడున్న వాళ్ళందరికూడా ఎంతో బాధేస్తుంది! కళ్ళవెంట నీళ్ళొస్తాయి!

"బాబూ! ఇవేళ్టినించీ మా మృణాళిని

బాగోగులు నువ్వే చూసుకోవాలి …జాగ్రత్త బాబూ …'' అలా అంటుంటే నిరంజనం గారి కళ్ళు చెమ్మగిల్లాయి.

"భలేవారండి ! ఇంతకు ముందామె మీ కుమార్తె మాత్రమే ఇప్పుడు నా భార్య కూడా ! ఆమె బాగోగులు చూట్టం నావిది'' అన్నా నెమ్మదిగా.

తృప్తిగా కళ్ళు తుడుచుకున్నారాయన.

టాక్సీలో అక్కడ్నించి మా ఇంటి కొచ్చాం.

దిగంగానే మళ్ళీ హడావిడి —

ఒకళ్ళపేరు మరొకళ్ళు చెప్పాలన్నారు.

"నేను. మృణాళిని వచ్చాం'' అన్నాను వెంటనే తడుముకోకుండా.

మృణాళిని మాత్రం సిగ్గుపడిపోయింది.

నాపేరామె చెప్పి తీరాల్సిందేనని పట్టు బట్టారంతా !

చివరికి తప్పించుకోలేక పక్కనున్న నాక్కూడా వినీ వినబడనంత నెమ్మదిగా చెప్పి తప్పించుకొంది !

— ఇలాంటి ఎన్నో మధురస్మృతుల్ని మనసులో ముద్రించి పెళ్ళంతో చక్కగా జరిగిపోయింది. సత్యనారాయణ వ్రతంకూడా అయిపోయింది. మా ఇంట్లో మూడు నిద్రలూ ఇట్టే గడిచిపోయాయ్.

ఆ మూడు రోజులూ పగలల్లా సర్దాగా కబుర్లు చెప్పుకోవడం — సాయంత్రమయ్యే సరికి ఏ సినిమాకో, షికారుకో వెళ్ళడం! మూడురోజులూ గడిచేసరికి మా ఇద్దరి మధ్య బెరుకు పూర్తిగా పోయింది. ఆమెకి మాఇల్లు మనుషులుకూడా కొద్దిగా అలవాటుబడ్డారు.

మృణాళినీ వాళ్ళింట్లో మూడు నిద్రలకీ బయల్దేరాం.

మేము వెళ్ళేసరికీ బాగా దగ్గరవుట్టాలు అయిదారుగురు తప్ప అంతా వెళ్ళిపోయారు. ఇంట్లో ఇంకా పెళ్ళి హడావిడి పూర్తిగా తగ్గలేదు. పగటి పూట మృణాళిని కనబడటమే గగనమైపోయింది.

సాయంత్రం అయిదయుంటుంది. నిద్ర లేచినా బద్ధకమింకా పూర్తిగా పోలేదు. మంచమ్మీద కూర్చున్నాను. సిగరెట్టు తాగాలనిపిస్తోంది. కానీ అక్కడ తాగితె బాగుండదేమో ? అలా బయటి కెళ్తే బాగుంటుందనుకుంటున్నాను.

ఇంతలో కాఫీ తీసుకుని గదిలోకొచ్చింది మృణాళిని

చటుక్కున చెయ్యి పట్టుకుని పక్కన కూర్చోబెట్టుకున్నాను.

"ఎవరైనా చూస్తే బావుండదు'' సిగ్గుపడిపోయింది.

''చూడకపోతే బావుంటుంది. అంతేగా ?… సరే ! తలుపులు దగ్గరికి వేసివస్తాను.

"ఆపనిమాత్రం చెయ్యకండి — మీరు కూర్చున్నంత సేపు మీ కెదురుగానే కూర్చుంటాను''

''అలారావాలి దారికి. ఊరికేకూర్చుంటే కుదర్దు మేడమ్ కబుర్లు చెప్పాలి. మమ్మల్నానందింపజేయాలి. బోరుకొట్టి చచ్చి పోతున్నాం ''

''అంతగా బోర్ కొడ్తే ఏదైనా సినిమా కెళ్తే పోలా?''

''అవును పోలా … మరి నువ్వుకూడా రావాలి ''

''రావాలేంటి వచ్చి తీరతాను. ఇప్పుడు మీరొక్కళ్ళే ఎక్కడికీ వెళ్ళడానిక్కుదర్దు మాష్టారూ! ఇక మీరెక్కడికివెళ్ళినా పక్కన నేనుండి తీరాల్సిందే !''

''నో…నేనొక్కడ్నే వెళ్తాను. ఆరోజు అర్జెంటుగా కొన్ని ముఖ్యవిషయాలు మాట్లాడాలంటే రాలేదుగా నువ్వు '

''అవి పాతరోజులు సార్ ! రోజులు మారాయ్ నేనిప్పుడూ మీ అర్ధభాగాన్ని. అప్పుడు నేను మీతో ఎక్కడికైనా వస్తే తప్పు, ఇప్పుడు రాకుంటే తప్పు.'' చిన్నగా నవ్వింది.

మృణాళిని నవ్వితే మరింత అందంగా వుంటుంది. అంతఅందం అందుబాటులో ఎదురుగా వుంటే నిగ్రహించుకోవడం కష్టంగా వుంది. దగ్గరకు లాక్కున్నాను.

"ష … టైమైపోయింది సినిమాకి. తొందరగా మొహం కడుక్కొని, చీరమార్చు కొనివస్తాను'' సున్నితంగా చేతుల్లోంచి తప్పించుకొని లోపలికి పారిపోయింది.

పదినిముషాల్లో అప్సరవలా తయారై తిరిగి రూమ్‌లోకి అడుగుపెట్టింది.

"మాష్టారూ ! టైమెంతైందో తెల్సా? ముందు త్వరగా మొహం కడుక్కోరండి'' కొంటెగా నవ్వింది.

"నిన్నలాగ్గే చూస్తూ కూర్చోవాలని పిస్తోంది …''

"తర్వాత తీరిగ్గా చూస్తూ కూర్చుందురుగాని ! ముందు మనం సినిమాచూడాలి. లేవండి'' చేతులు పుచ్చుకుని లాగింది.

లేచి ఆమెవెనకే నడిచాను — మరో పది నిముషాల్లో బయటికిబయల్దేరింది.


బయటికి రాగానే సిగిరెట్టు వెల్గించి, తృప్తిగా ఒకదమ్ములాగాను. మనసు ప్రశాంతంగావుంది పెద్ద రిలీఫ్ !

''ఏమండీ ! మీకు సిగిరెట్లు బాగా అలవాటా ?'' అదోవిధంగా మొహంపెట్టి అంది మృణాళిని.

''అలవాటేననుకో…ఏం అలాఅడిగావ్!''

''నాకీ వాసన పడదు…''

''సారీ మృణా !'' చేతిలోని సిగిరెట్టుని విసిరేశాను వెంటనే ఆమె మొహం తళుక్కున మెరవడం గమనించాను. ఆమెనలా చూస్తుంటే నాకు తృప్తిగా అన్పించింది.



## భారత్ - ఆస్ట్రేలియా టెస్ట్ సీరీస్

భారత ఆస్ట్రేలియాలమధ్య 1977-78 సీరీస్‌లో జరిగిన ఐదు టెస్టు పోటీలలో మన క్రికెట్ క్రీడాకారులు చేసిన పరుగులు, తీసుకున్న వికెట్ల వివరాలు యిలా వున్నాయి:

**ఐదు టెస్టులలోను ఆడినవారు :**

జి.ఆర్.విశ్వనాథ్ 473 పరుగులు చేశారు [ఎక్కువస్కోరు 89] ; గవాస్కర్ 450 [మూడు సెంచరీలతోసహా ఎక్కువస్కోరు 127]; మొహిందర్ అమర్‌నాథ్ 445 (100), 228పరుగులు యిచ్చి 7వికెట్లు తీసుకున్నారు; వెంగ్ సర్కార్ 320(78); కిర్మాణి 305(55); బిషన్‌సింగ్‌బేడీ68 (26 నాట్అవుట్), 730 పరుగులుయిచ్చి 31 వికెట్లు తీసుకున్నారు; చంద్రశేఖర్ 4 (2), 704 పరుగులు యిచ్చి 28 వికెట్లు తీసుకున్నారు.

**నాలుగు టెస్టులలో ఆడినవారు :**

చేతన్ చౌహాన్ 229(88); ప్రసన్న 92 (25నాట్అవుట్) 279 పరుగులుయిచ్చి 6వికెట్లు తీసుకున్నారు.

**మూడు టెస్టులలో ఆడినవారు :**

అశోక్‌మంకడ్ 119(44); ఘావ్రి 102 (64), 281 పరుగులుయిచ్చి 11వికెట్లు తీసుకున్నారు.

**రెండు టెస్టులలో ఆడినవారు :**

మదన్‌లాల్ 52 (43), 197 పరుగులు యిచ్చి 9 వికెట్లు తీసుకున్నారు; పటేల్ 46 (27).

**ఒక టెస్టులో ఆడినవారు**

వెంకటరాఘవన్ 51(37),141పరుగులు యిచ్చి 2 వికెట్లు తీసుకున్నారు; గైక్వాడ్ 39 (27).

సేకరణ : జె గోపాల్ ప్రసాద్.

---

నడుస్తూనే నాకు దగ్గరగా వచ్చింది. నేను, నాపక్కనే నన్ను దాదాపు తాకుతున్నట్లుగా మృణాళిని–నడుస్తున్నాం.

ఛటుక్కున వాళ్ళిద్దరూ గుర్తుకొచ్చారు.

"మృణా ! నీకో విషయం చెప్పనా?" అన్నాను.

ఏంటన్నట్లు నా వంక జూసింది.

"హైదాబాదులో మనింటిదగ్గర వో జంటువున్నారు. వాళ్ళిద్దరూ ఉద్యోగం చేస్తున్నారు. ఉదయం నే నాఫీసు కెళ్ళే ప్పుడు సాయంత్రం వచ్చేప్పుడు కన్పిస్తూంటారు. ఎప్పుడూ నవ్వుతూ, తుళ్ళుతూ–ఒకళ్ళకోసం మరొకళ్ళం పుట్టామన్నట్లు వింతో అన్యోన్యంగా వుంటారు వాళ్ళు..."

"రోజూ వాళ్ళ అన్యోన్యతని గమనించడమేనా మీ పని..." నవ్వింది.

"వాళ్ళనలా చూస్తుంటే ఎంత ముచ్చటేస్తుందని ! కావాలనే ప్రతిరోజూ వాళ్ళు బయల్దేరే సమయంలోనే నేనూ బయల్దేరుతూంటాను. వాళ్ళ వెనకే బస్టాండ్ చేరుకుంటాను. వాళ్ళని చూసినప్పుడల్లా ఏమనిపించేదో తెల్సా ?"

"ఏమనిపించేది ?"

"అటువంటి భార్యని పొందిన అతనెంత అదృష్టవంతుడో కదా అన్పించేది. నేను కూడా పెళ్ళనేది చేసుకుంటే ఆ విధంగా కల్సిపోయే పిల్లనే చేసుకోవాలను కుంటూ వుండేవాణ్ని..."

"మరిప్పుడేమనుకుంటున్నారు ?"

"నా కలలన్నీ నిజమయ్యాయని వింతో ఆనందంగా వుంది. మనిద్దరం ఇలా సర్దాగా

# కొత్త జీవితం

బయల్దేరేసరికి వాళ్ళిద్దరూ గుర్తుకొచ్చారు. అన్నట్లు ఏ సినిమాకెళ్దాం ?"

"మీ ఇష్టం"

"కాదు నీ ఇష్టం"

"ఏ సినిమా బావుంటుందో మీరే చెప్పండి,"

"సరే 'అమరదీపం' కెళ్దాం. రిక్షా మాట్లాడనా?"

"వద్దండీ ! ఇలాగే కబుర్లు చెప్పుకుంటూ నడిచి వెళ్దాం."

"ఇలా మనం వెళ్తే ఇంటర్వెల్ టైమ్‌కి హాలుని జేరుకుంటాం. రిక్షాలో ముందు హాల్‌కి జేరుకుని, తర్వాత హాల్లో తిరిగ్గా మాట్లాడుకుందాం... ఒకే..."

"మీ ఇష్టం"

"ప్రతిదానికీ మీ ఇష్టం... మీ ఇష్టం అంటావ్. అసలు నీ కిష్టమనేదేమైనా వుందా ?"

"ఎందుకులేదూ ? మీ కిష్టమైన ప్రతీదీ నా కిష్టమే !"

మేం హాలుకి చేరుకునేసరికి సినిమా ఇంకా మొదలుపెట్టలేదు. ఇందాక సిగిరెట్టు సరిగ్గా తాగకపోవడంతో మనసు పీకుతోంది. మృణాళిన్ని లోపల కూర్చోబెట్టి ఇప్పుడే వస్తానని బయటి కొచ్చాను.

సిగిరెట్టు కాల్చి, నీళ్ళు పుక్కిలించి వుమ్మేసి, వక్కపొడి నములూ తిరిగి హాల్లోకి అడుగు పెట్టాను.

సరిగ్గా నేను లోపలికి రాగనే న్యూస్‌రీల్ ప్రారంభమైంది.

"ఎక్కడి కెళ్ళారు ?" అడిగింది మృణాళిని.

"ఇక్కడికే...వక్కకి..."నసిగాను.

మాట్లాడగానే వాసన వేసినటుంది.

"మీరు సిగిరెట్టు తాగడానికి బయటి కెళ్ళారు కదూ ?" నిలదీసింది. ఆమె అలా అడిగేసరికి సిగ్గేసింది. మాట్లాడలేకపోయాను.

"సిగిరెట్టు తాగడం మంచిది కాదనే విషయం మీకు తెల్సు- అయినా తాగుతున్నారు. మీరు మానరనే విషయం నాకు తెల్సు- అయినా అడుగుతున్నాను. మీరీ అలవాటుని దూరం చేసుకోలేరా ?" మళ్ళీ తనే అడిగింది

"సారీ మృణా ! ఈ ఒక్క బలహీనతని వదిలెయ్ ఐదొక్కటె నాకున్న అలవాటు. మిగతావేవైనా నువ్వు చెప్పినట్టు చేస్తాను. ఇదిమాత్రం మానలేను. మనసు చికాగ్గా వున్నా, సంతోషంగా వున్నా, కాస్త ఆలోచించాలన్నా నాకు సిగిరెట్టు 'తప్పనిసరైన' అవసరం ! చాలాకాలం నించీ వున్న ఈ అలవాటుకి మాత్రం అడ్డు చెప్పకు ప్లీజ్" ప్రతిమాల్తున్న ధోరణిలో అన్నాను.

కిలకిల నవ్వేసింది మృణాళిని.

"భలేవారండీ ! దీనికంతగా బాధపడిపోతారెందుకు సిగిరెట్టు తాగడం మంచల వాటు కాదు కాబట్టి మానగ్గలేమోనని అడిగాను. పూర్తిగా మానలేకపోతే కనీసం తగ్గించడానికైనా ప్రయత్నించండి."

"తప్పకుండా" సంతోషంతో అనేశాను.

"మీరు సిగిరెట్లు తాగడం మానలేరు కాబట్టి నేనీ వాసన్ని భరించడం నేర్చుకోవాలి" నవ్వింది.

నేనూ నవ్వాను.

—ఎంతో సర్దాగా గడిచిపోయాయ్ మృణాళిని వాళ్ళింట్లో వున్నన్ని రోజులు. ఆమెని వదిలి తిరిగి హైదరాబాద్ చేరుకోవాలంటే ఏంటోగావుంది. ఆమెకూ అంతే.! ఇన్నాళ్ళూ ఒకళ్ళులేకుండా మరొకళ్ళు ఎలా వున్నామా అన్పించింది.

వీలైనంత త్వరలో తన్ని తీసుకెళ్ళమని దీనంగా అడిగింది మృణాళిని బయల్దేరుతుంటే.

"అలాగే"నని ఆమె నోదార్చి, అన్యమనస్కంగానే అక్కడ్నించి బయల్దేరాను·

హైదరాబాద్ చేరుకున్న మర్నాటినించే ఇళ్ళవేట ప్రారంభించాను. అదృష్టం కొద్దీ త్వరలోనే నేనుంటున్న గదిపక్కనే వున్న ఓ పోర్షన్ ఖాళీఅవడంతో అడ్వాన్సిచ్చి ఆ ఇంట్లోకి మారిపోయాను. వెంటనే ఆ విషయం నాన్నగార్కి, మృణాళినికి రాసి పడేశాను.

దాదాపు పదిహేనురోజులు కాస్త ఇబ్బందితోనే గడిచాయ్. మృణాళిని వచ్చింది. నా జీవితంలోకి నూత్నచైతన్యాన్ని తెచ్చింది.

'వాళ్ళిద్దర్నీ' మృణాళినికి చూపించాలన్న కోరికతో మర్నాడు తొమ్మిదిమ్ముప్పావుకి వాకిట్లో నించున్నాను.

"ఏంటండీ ! అక్కడ నిలబడ్డారు ?" తనూ వాకిట్లోకొచ్చింది మృణాళిని.

"నీకు చెప్పాను చూడు పార్వతీ పరమేశ్వరుల గురించి. వాళ్ళొచ్చే టైమైంది... వాళ్ళని నీకు చూపిద్దామని..."

మృణాళిని నవ్వింది.

ఆమె నవ్వితే అందం మరింత విజృంభిస్తుంది. అందం విజృంభిస్తే నేవలా చూస్తూ వూరుకోలేను చూపులు రోడ్డు మీదకి మళ్ళించాను.

వాళ్ళిద్దరూరానేవస్తున్నారు మామూలే! అతను నవ్వుతూ ఏదో చెప్తున్నాడు. ఆమె చిఱునవ్వుతో వింటోంది.

"మృణా! వాళ్ళు... మిగతా ప్రపంచంతో సంబంధం వుండదు వాళ్ళకి. వాళ్ళ లోకం వాళ్ళది !"

"నిజమేనండి ఏంతో ముచ్చటేస్తోంది వాళ్ళని చూస్తుంటే"

"అందుకే అమ్మడూ! వీళ్ళిద్దరిగురించి నీకంతగా చెప్పింది" వరాండాలోవున్నకుర్చీలో కూర్చుంటూ అన్నాను.

"ఏమండోయ్ ! ఇప్పుడు టైమెంతైందో తెల్సా — తీరిగ్గా మళ్ళీ కూర్చుంటున్నారు ?"

"ఉహూఁ ! ఇవాళ నేనాఫీసుకి వెళ్ళను"

"అయితే ఒకపని చెయ్యండి..."

"ఏంటి చెప్పు ?"

"శుభ్రంగా ఆఫీసు మానేసి మీరలా ఓ కుర్చీలో కూర్చోండి. మీ కెదురుగా నే నొక కుర్చీ వేసుక్కూర్చుంటాను."

"ఓ యస్ !"

"మనకి అన్నం, నీళ్ళు— ఏమీ వద్దు"

"ఆకలుండదు— దాహముండదు నిన్ను చూస్తుంటే..."

"మీరలా కూర్చున్నా నాకేం అభ్యంతరం లేదుకాని ప్లీజ్ పాడకండి"

"ఓకే! పాడనుగాక పాడను. బయపడకు"

"ఏఁవండీ ! నాకు తెలీక అడుగుతాను. ఆఫీసు కెళ్ళకుండా ఎవరైనా పెళ్ళాంకొంగు పట్టుకు తిరుగుతారేంటి ?"

"అందరి సంగతి వేరు— మన సంగతి వేరు. సరేపోన్లే... నాకు లంచం ఇస్తే వెళ్తాను" నవ్వుతూ లేచి నిలబడ్డాను.

"లంచాలు, కుంచాలు నా దగ్గరెత్తకూడదు. నేను చాలా స్ట్రిక్ట్" వసిగట్టి దూరంగా జరిగింది మృణాళిని.

"వస్తామరి ఆఫీసు కాలస్యమైందంటే రేనిపోని సంజాయిషీలిచ్చుకోవాలి" మృణాళిని చేతిని పట్టుకుని సున్నితంగా నొక్కి వదుల్తూ అన్నాను.

నా వెనకే తనూ గేటుదాకా వచ్చింది, రెండడుగులు వేసి వెనక్కి చూశాను.

తనక్కడే నిలబడి నవ్వుతూ.చూస్తోంది చెయ్యూపాను. ఆమే చెయ్యూపింది.


"సాయంత్రం పెందరాడే వస్తారుగా?"

"ఆరుగంటలకల్లా ఇంట్లో వుంటాను" గబగబా బస్టాండ్ కేసి నడవసాగాను.

ఎంతో తృప్తిగా వుంది. కోరుకున్న జీవితాన్ని సాధించగల్గాను. మా ఇద్దరిమధ్యా పొరబాటున కూడా అభిప్రాయభేదాలు రావు. ఒకవేళ ఎవరైనా ఒకళ్ళు తొందరపడ్డా రెండోవాళ్ళు సర్దుకుపోయేవాళ్ళం.

మృణాళిని రాకతో నా దినచర్యలో ఎన్నో మార్పులొచ్చాయ్. పొద్దున్నే ఆమెతోపాటె లేచి ఆమెకాపన్లో, ఈ పన్లో అడ్డంపడుతూ, సహాయపడుతూ గడపటం. ఆఫీసుకి టైమైపోతోందని మృణాళిని తొందరజేస్తే స్నానం, భోజనం వగైరాలు కానివ్వడం... ఆ తర్వాత ఆఫీసు ...

తిరిగి సాయంత్రం ఆరుగంటల కల్లా ఇంట్లో ప్రత్యక్షం. అప్పటికే తను పనంతా పూర్తిచేసుకుని రెడీగా వుంటుంది మృణాళిని. కాఫీ తాగింతర్వాత ఇద్దరం కల్సి కాసేపలా షికారుకెళ్ళడం ! మళ్ళీ ఏ ఏనిమిది గంటలకో ఇంటికి జేరుకోవడం ... భోజనం ... కబుర్లు ... నిద్ర నేనూహించి



# కొత్త జీవితం

నట్టు దీంతోసాఫీగా సరిగ్గా ప్రారంభమైంది మా వైవాహిక జీవితం.

ఆఫీసుకెళ్ళినంతసేపూ మృణాళినికి దూరంగా వుండాలి.

ఆఫీసంటేనే పనిష్మెంటులా వుంటోంది.

తొమ్మిదిమ్ముప్పావైంది. ఇక తప్పదన్నట్టు బయల్దేరాను.

మృణాళిని గేటుదాకా వచ్చింది.

సాయంత్రం పెందరాడే వచ్చేస్తానని బయల్దేరాను.

అలవాటు ప్రకారం సిగరెట్టు కోసం గడ్డియ్య కిళ్ళీకొట్టు దగ్గరాగాను ఇదివరకు రోజుకొక పాకెట్ కాల్చేవాణ్ని. మృణాళిని వచ్చింతర్వాత సిగరెట్ల కోటా అరపాకెట్ లోకి పడిపోయింది. ఇబ్బందిగానే వున్నాఆమె సంతృప్తి కోసం తప్పదు!

నేను శంకరమఠం చేరేసరికి ఆమె బస్సు వచ్చి వెళ్ళిపోయినట్టుంది. అతనొక్కడే నిలబడున్నాడు.

మామధ్య మాటల్లేకపోయినా, రోజూ ఒకళ్ళనొకళ్ళు చూసుకుంటూనే వుంటాం కాబట్టి పలకరింపుగా నవ్వాడు.

నేనూ నవ్వాను.

"మీరెక్కడ పని చేస్తున్నారు ?" నా దగ్గరకొచ్చి అడిగాడు. చెప్పాను అతనూ తన వివరాలు చెప్పాడు.

అతని పేరు విశ్వం. కాచిగూడలో ఏదో ప్రైవేటుకంపెనీలో పనిచేస్తున్నాడు. ప్రతీ రోజూ నైన్టీటూలోగాని, నైన్టీత్రీలోగాని వెళ్తూంటాడు. భార్యపేరు శారద. కోఠీ... బాంక్‌లో పనిచేస్తోంది ఇద్దరికీ వివాహమై సంవత్సరం కావస్తోందిట — ఇవి మా సంభాషణద్వారా నేను వాళ్ళగురించి తెల్సుకున్న విషయాలు.

ఇంతలో బస్సురావడంతో అతని దగ్గర శలవు తీసుకుని బస్సెక్కాను.

విశ్వం — శారద!

పేర్లు కూడా వాళ్ళదాంపత్యం లాగానే దింతో ముచ్చటగా వున్నాయ్! అతను మాట్లాడేతీరులో ఎంతాకర్షణ! అతనితో ఏర్పడ్డ ఆ కొద్ది పరిచయంతోనే వాళ్ళమీద అభిమానం మరింత పెరిగింది. రద్దీ, త్రొక్కిసలాటల మధ్య బషీర్‌బాగ్ చేరుకున్నాను.

అక్కడ నాతోపాటే శశిరేఖ ప్రసాద్ దిగారు.

నేను వాళ్ళాఫీసులోనే పని చేస్తున్నాను. నేనూ శశిరేఖ ఒకే సెక్షనుకూడాను! పైగా రోజూ ఒకే బస్సులో వస్తాం. అయినా వాళ్ళతో పెద్దగా పరిచయంలేదు. ఒకటి రెండుసార్లు నేనాతనో మాట్లాడదామని ప్రయత్నించినా అతను ముభావంగా మాట్లాట్టంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాను.

పలకరించగానే విపరీతమైన చనువు పెంచేసుకుని అతని భార్యతో తెగ మాట్లాడేస్తూ కూర్చుంటానని భయమేమో! వట్టి అనుమానం మనిషి లాగున్నాడు. భార్యాభర్తలు కూడా ఒకళ్ళనొకళ్ళు నమ్మకపోతే జీవితంలో ఇంకెవర్ని నమ్ముతారు ? ఎవరిమీదా నమ్మకం, అభిమానం


త్వరలో

విముక్తి

సీరియల్


లేని ఆ జీవితంలో ఎన్ని చక్కటి అనుభూతుల్ని కోల్పోతారు.

పాపం! అతనితో శశిరేఖ జీవితాన్నెలా నెట్టుకొస్తోందో? 'వాళ్ళిద్దరు' లాగానే 'వీళ్ళిద్దరు' కూడా నాకాదర్శప్రాయులు. భార్యతో ఎలా మెలగాలో అతనిదగ్గర నించీ తెలుసుకుంటే ఎలా మెలగ కూడదో ఇతని దగ్గర్నించి తెలుసుకుంటున్నాను!

ముందు వాళ్ళిద్దరూ—

వెనక నేను...

పలకరించకపోతే పలకరించకపోయాడు. కనీసం పలకరింపుగా నవ్వనైనానవ్వొచ్చుగా? ఊహూఁ... ఎప్పుడు చూసినా ఆ మొహం చిట్లేదేస్తే పుట్లేదేగుతూనే వుంటుంది...

ఎవరి ఆలోచనలో వాళ్ళం ఆఫీసుకి చేరుకున్నాం. ఆఫీసుకి చేరేంతవరకే ఈ ఆలోచన్లు. అక్కడికి వెళ్ళినప్పట్నించీ తిరిగి అయిదున్నరకి బయట పడేవరకూ ఆ ఫైళ్ళు, కాంట్రాక్టులు— అవేగొడవలు.

అయిదున్నరకల్లా ఆఫీసులోంచీ బయట పడి సరాసరి ఇంటికొచ్చేశాను. తన పన్లన్నీ పూర్తిచేసుకుని రెడీగావుంది మృణాళిని ఇంటికొచ్చేసరికల్లా ఆమె అలా తయారై చిరునవ్వు చిందిస్తూ కాఫీతో ఎదురొచ్చేసరికి బడలికంతా హూష్ కాకి!

"తీసుకోండి" కాఫీ కప్పు నందిస్తూ అంది మృణాళిని.

"తీసుకోను."

"ఎందుకు తీసుకోరు ?"

"నువ్వూ నాతోపాటు తాగాలి."

"నే నిందాకే తాగాను. ఎక్కువసార్లు కాఫీ తాగడం నా కిష్టముండదండి."

"సరే అయితే నాకూవద్దు."

"అగండైతే నేనూ తెచ్చుకుంటాను" లోపలికి వెళ్ళబోయింది మృణాళిని.

"ఆగు" ఒకచేత్తో కాఫీ కప్పుని, మరో చేత్తో ఆమె చెయ్యిని పట్టుకున్నాను.

ప్రశ్నార్థకంగా చూసింది

"రా! ఇలావచ్చి కూర్చో" నా పక్కనే చోటు చూపిస్తూ అన్నాను మౌనంగా వచ్చి కూర్చుంది.

"షిష్టీ...షిష్టీ..." ఆమె నవ్వింది.

ఇద్దరం కల్సి కాఫీకప్పుని ఖాళీ చేశాం. మరో పదినిముషాల్లో తెమిలి ఇద్దరం అలా షికారుకి బయల్దేరాం.


నిజంగా నాకెంతో తృప్తిగావుంది జీవితం. అన్నివిధాల యోగ్యురాలైన భార్య! ఆమె నా జీవితంలోకి అడుగు పెట్టింది.నాకు చాలా చికాకులు దూరమయ్యాయ్. ఒకవేళ వచ్చినా వాటిని వెంటనే బలవంతాన తరిమేస్తుంది.

నాకు వూరికినే కోపం వస్తుంది. ఆ విషయం నాకూ తెల్సు! అయినా తమాయించుకోలేకపోతున్నాను. ఏ కొద్దిగా అప్సెట్టైనా విపరీతమైన చికాకొచ్చేస్తుంది. ఇప్పుడు మృణాళిని వుందికాబట్టి నా బలహీనతని పసిగట్టేసి తప్పు నాదే అయినా కోపంరాగానే తన ప్రతిమాలు ధోరణిలో నన్ను చల్లబరిచేస్తుంది. పెళ్ళి కాక ముందిలా అప్సెట్టైపోయినప్పుడు అన్నం తినకుండా, సరిగా నిద్రపోకుండా ఎన్నిపూటలు గడిపానో!

(ఇంకావుంది)

# కొత్త జీవితం

వేదగిరి రాంబాబు, మైనంపాటి భాస్కర్



(గత సంచిక తరువాయి)

భార్యకి భర్తలో వున్న, భర్తకి భార్యలో వున్న మంచిగుణాలు కన్నా బలహీనతలు తెల్సుకోవల్సిన అవసరమెంతో వుంది! అలా తెలుసుకుంటే ఒకళ్ళు బలహీనతకి లోనైనప్పుడు రెండోవాళ్ళు వాళ్ళనాబలహీనత నించీ బయటికి లాగడానిక్కి ప్రయత్నించవచ్చు. రెండర్ధభాగాలూ కలుస్తేనే నిండైన జీవితమయ్యేది! నా జీవితం నిండు జీవితమే సందేహం లేదు...

"ఏంటాలోచిస్తున్నారు ?." అడిగింది మృణాళిని.

"నీ గురించే" నవ్వాను

"నా గురించా...? ఏంటట అంత ఆలోచించే ఆ విషయం ?"

"నీ ప్రవేశంతో నా జీవితానికి పూర్తి సార్ధకత చేకూరింది"

"చాల్లెండి. మిమ్మల్ని కదిలిస్తే చాలు పొగడ్తలు. మీరు మరీ భట్రాజులై పోతున్నారండి"

"పొగడ్తకాదు మృణా! పచ్చినిజం."

"ఇందులో పెద్ద విశేషమేమీలేదు. ప్రతీ భార్యా భర్త విషయంలో చూపించే శ్రద్ధే నేనూ చూపిస్తున్నాను అంతే!" పొగడ్తలామెకి గిట్టవు. అదో ప్రత్యేకత.

తిరిగి తిరిగి ఎనిమిది గంటల ప్రాంతంలో ఇంటికి జేరుకున్నాం. తర్వాత వంట... కబుర్లు... నిద్ర...

ఆ రోజాఫీసులో ఏదో అర్జంటు పనుండి రాత్రి ఏడుగంటల దాకా బయట పడ్లేకపోయాను. ఆ తర్వాత బస్సుకోసం చూట్టం చికాకనిపించింది.

ఆటోలో బయల్దేరి వచ్చేసాను.

మృణాళినితో సర్దాగా కబుర్లు చెప్పాల్సిన టైమ్‌లో అప్పుడే గంట వేస్టయింది. బస్సుకోసం వెయిట్‌చేసి మరోగంట వేస్ట్ చెయ్యడం ఇష్టంలేకపోయింది.

గుమ్మంలో నిల్చొనెదురు చూస్తోంది మృణాళిని.

మొహం పాలిపోయి వుంది. కళ్ళల్లో భయం కొట్టొచ్చినట్లు కనబడుతోంది.

నవ్వొచ్చింది నాకు!

రెండు గంటలు కూడా ఆలస్యంకాలేదు .త భయమా!

"అమ్మయ్య! వచ్చేశారా! ఇంతసేపైనా మీరు రాకపోయేసరికి ఎంత భయపడిపోయానో!"

"ఎందుకోయ్ పిచ్చి!" లాలనగా అన్నాను. నేను వచ్చేసినా ఆమె కళ్ళల్లో భయం ఇంకా తగ్గలేదు. దగ్గరకి తీసుకుని ఆ కళ్ళమీద ముద్దు పెట్టుకోవాలనిపించిది. కానీ ఆమె గుమ్మంలో నిలబడ్డంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకుని ఆమె వెనకే లోపలికి నడిచాను.

"ఇంకెప్పుడూ ఇంతాలస్యం చెయ్యకండి. ఎంత భయం వేసిందో తెల్సా నాకు? ఎన్ని రకాల ఆలోచనొచ్చాయో... అమ్మో..." ఇంకా భయంగానే అంది.

నవ్వాను.

"కాళ్ళూ చేతులు కడుక్కుని, గుడ్డలు మార్చుకోండి భోజనం వడ్డిస్తాను" అంది.

"వన్ మినిట్ నువ్వు భోజనం అనగానే గుర్తుకొచ్చింది. సిగిరెట్లైపోయాయ్. తీసుకోవాలనుకునే మర్చిపోయాను. ఇప్పుడే గడ్డియ్య కొట్లో తెచ్చుకుంటాను" చెప్పి లేసుకుని బయల్దేరాను పదును చూపొకటి చూసి వంటింట్లోకి వెళ్ళిపోయింది మృణాళిని.

నన్నుచూడగానే గడ్డియ్య 'ఫోర్ స్క్వేర్' సిగిరెట్లు తీసిచ్చాడు చిల్లరిస్తూ "విశ్వం సాబ్ తెల్సాసార్ మీకు ?" ప్రశ్నార్ధకంగా అడిగాడు.

"ఏ విశ్వం ..." చటుక్కున గుర్తుకొచ్చాడు. అవును అతనే!

"...కొద్దిగా పరిచయముంది ఎందుకూ ?" అతనలా ఎందుకడిగాడో అర్ధంగాక అడిగాను.

"కాచిగూడ దగ్గర వురుకుతున్న బస్సెక్కబోయిండంట జారి కిందపడిపోయిండు. కాళ్ళదగ్గర నించీ నడుందాకా బొక్కలిర్గిపోయినై. పాపం శానా మంచాయనసార్. అక్కడికక్కడే పోయిండంట... పాపం! ఆ యమ్మ బతుకు ఖరాబైపోయింది..." బాధగా అన్నాడు.

విశ్వం .ఆ నయనానందకరమైన జంటలోని సగభాగం ... బస్సు కిందపడి చనిపోయాడా ? అయ్యో ఎంత దారుణం జరిగిపోయింది! ఇంక అక్కడ నిలబడలేకపోయాను...

అక్కడ్నించీ ఇంటికెలా జేరానో కూడా నాకు సరిగ్గా తెలీదు వాకిట్లో పడక్కుర్చీలో వాలి, కళ్ళు మూసుకున్నాను.

ఇలా ఎలా జరిగింది ?

ప్రపంచంలోని ఆనందమంతా ఒక్కచోటే గూడు కట్టుకు చేరిందనుకున్నాను. విషాదపు ఛాయలు వాళ్ళమీద పట్టం అసంభవమనుకున్నాను నవ్వుతూ, తుళ్ళుతూ ఎంత హాయిగా వుండేవాళ్ళు! ఎంత మంచి మనిషి ఎంత దారుణ మరణం పాలయ్యాడు!

దేముడా! ఎందుకిలా జరిగింది ?

ప్రతీమనిషి జీవితంలో ఏదో లోటు వుండితీరాలా ? ఈ భూమ్మీద పుట్టినవాడెప్పుడూ ఆనందంగా వుంటానికి వీల్లేదా ? ప్రతీ ఇంటిలోనూ ఏవో కొన్ని ఇబ్బందుల్లో, కష్టాల్లో, నిట్టూర్పుల్లో వుండితీరాలా ?

అతను లేకుండా ఆమె జీవించగలదా ? ఎంతదెబ్బ తగిలిందమ్మా నీకు! ఆమెని తల్చుకుంటే గుండెలు చిక్కబడుతున్నాయ్.

బౌద్ధుల అష్టాంగ మార్గము — ధర్మపథం — బులుసు వేంకటరమణయ్య

# — ధర్మపథం —

## బౌద్ధుల అష్టాంగ మార్గము

బులుసు వేంకటరమణయ్య

ఆత్మానుభూతికి సాధనాలైన అష్టాంగ యోగాలు మన యోగశాస్త్రంలో చెప్పబడి ఉన్నవి. ఆవిధంగానే బౌద్ధమతంలోనూ అష్టాంగాలు చెప్పబడినవి. అవి సంయమనియమాదుల కంటె వేరైనవి. మానవునిలోని దుర్గుణాలను నిర్మూలించుటకు తగిన మార్గాలవి— సమ్యగ్దృష్టి, సమ్యక్సంకల్పం, సమ్యగ్వాక్కు, సమ్యక్కర్మ, సమ్యగ్జీవం, సమ్యగ్వ్యాయామం, సమ్యక్స్మృతి, సమ్యక్సమాధి. అనేవి వీనిలో ఒకదానితో మరొకదానికి అధికమైన సంబంధం ఉన్నది.

సమ్యగ్దృష్టి మేలైన— అంటే పవిత్రమైన చూపు. మొదట పట్టుబడవలసినది యిదే! మానవునికి ఉదారమైన దృష్టి ఉంటేనే గాని మనోవాక్కాయకర్మలలోని మాలిన్యం నశించదు.

ఆ తరువాతది సమ్యక్సంకల్పం. సమ్యగ్దృష్టి అలవడిన తర్వాత మానసిక సంస్కారం ఏర్పడి ఇది కలుగుతుంది ఏ సత్కార్యానికయినా — అసత్కార్యానికయినా సంకల్పం అవసరం. మానవునికి సత్సంకల్పమ్ అవసరం చతురార్య సత్యాలను ఫలితావస్థకు తెచ్చుకొనే యత్నమే యీ సమ్యక్ సంకల్పం.

మూడవది సమ్యగ్వాక్కు. మానవునికి ఉత్తమ సంకల్పం ఉన్నప్పుడు, దానిని ప్రకటించుటకు మాటకూడా పవిత్రమైనదిగానే ఉండవలెను.

సమ్యగ్వాక్కును అలవరచుకొన్న వ్యక్తి అసత్యం పలుకడు. పరుషంగా మాటలాడడు. పరులను నిందించడు. మృదుమధురంగా మాటలాడే వాడిని అందరూ గౌరవిస్తారు.

నాల్గవది సమ్యక్కర్మ. త్రికరణాలలో మనోవాక్కులు ఉత్తమములైనప్పుడు చేసే కర్మకూడా ఉత్తమంగానే ఉంటుంది. ప్రాణిహింస, చౌర్యం మున్నగు చెడ్డ పనుల మీదికి బుద్ధి పోనే పోదు.

తర్వాతది సమ్యగ్ జీవం. మానవుడు జీవించడానికి ఏదో ఓ వృత్తిని ఆశ్రయించక తప్పదు. ఆవృత్తి మేలైనదీ, తనకూ, ఇతరులకూ హానిని కలిగించేది కాకూడదు. అట్టి జీవనమే సమ్యగ్ జీవం.

ఆరవది సమ్యగ్ వ్యాయామం చెడ్డ సంకల్పాలను మనస్సులో చేరనియ్యకుండా మనస్సును మంచి ఆలోచనలలో ప్రవేశ పెట్టడం సమ్యగ్ వ్యాపారం.

తర్వాతది సమ్యక్ స్మృతి. శరీరం అపవిత్ర పదార్థాలతో నిండినదనే విషయం మరువక, వాటి అనర్థాలను గుర్తించుటయే సమ్యక్ స్మృతి.

చివరిది సమ్యక్సమాధి. ఈ యి సప్త మార్గాల మూలంగా మానవునికి వైరాగ్యం కలుగుతుంది. దాని మూలంగా నిర్వాణాన్ని అంటే ముక్తిని పొందే అవస్థయే సమ్యక్సమాధి. దానివల్ల మానవునికి పునర్జన్మ లేకుండా పోతుంది.

---

# కొత్త జీవితం

"ఏంటీ? ఇక్కడ పడుకున్నారు! మీరింకా రాలేదేంటా అనుకుంటున్నాను. వడ్డించాను లేవండి" అంటూ మృణాళిని వచ్చింది.

"మృణా! నాకిప్పుడు అన్నం తినాలని లేదు. కాసేపు మాట్లాడించబాకు" మనసంతా చిందరవందరగా వుంది. ఎవ్వరితోనూ మాట్లాడాలన్పించడంలేదు."

"ఏంటండీ అలా వున్నారు! నేనేమైనా బాధ కల్గించానా? చెప్పండి ప్లీజ్... మీరట్లా వుంటే నేను చూళ్ళేను..." ప్రాధేయపడసాగింది.

మృణాళినలా బాధ పడతూంటే ఇంకా మాట్లాడకుండా వుండలేకపోయాను ఆమెతో చెప్పుకుంటే మనసుకి కొద్దిగనైనా వూరట కల్గుతుంది. కానీ ఎలా చెప్పాలి?

"నీకు చూపించాను చూడు చక్కని జంటని... అందులో అతను - విశ్వం... సాయంత్రం బస్‌కిందపడి చనిపోయుట్ట..." నా మాటలు నాకే ఎబ్బెట్టుగను, నమ్మలేనివిగానూ అన్పించాయి.

మృణాళిని షాక్ తింది ఆ మాటలువిని మొహం విషాదపూరితమైపోయింది. మాటా పలుకూలేకుండాఅలాగే కూర్చుండిపోయింది. ఆమెక్కూడా వాళ్ళిద్దరూ అన్యోన్యంగాతిరిగిన ఆ జ్ఞాపకాలే గుర్తుకొచ్చినట్లున్నాయ్! కళ్ళు చెమ్మగిల్లాయి. అతని మరణం మాకే ఇంత బాధని కల్గిస్తే ఆమె పరిస్థితెలా వుందో?

ఇద్దరిమధ్యా సరైన అవగాహన లేని వాళ్ళైతే ఆ షాక్‌కి కొంతవరకైనా తట్టుకోగలరు? అతను లేకుండా ఆమె, ఆమె లేకుండా అతను పొరబాటునకూడా బయటికొచ్చేవాళ్ళు కారు. ఎంతో అన్యోన్యంగా చూసేవాళ్ళక్కూడా ముచ్చట గొలిపేటట్లుండేవారు.

ఇంక జీవితాంతం ఆమె అతన్ని చూడకుండా వుండగల్దా? ... నో ... ఆవిడవల్ల కాదా పని. ఒకవేళ ఈ వార్త వినగానే ఆమెకూడా ... ఛీ ... ఛీ ... ఏమిటీ ఇట్లా ఆలోచిస్తున్నాను. నా ఆలోచన్లు నాకే చిరాకేశాయి.

వెంటనే ఆమెని చూడాలని బయల్దేరాను.

"ఇక్కడికి దగ్గరే వాళ్ళిళ్ళు ఇప్పుడే చూసొస్తాను..."

"పాపం...వెళ్ళిరండి..."

గబగబా బయటికొచ్చాను.

—వాళ్ళ సందులోకి ప్రవేశించగానే వాళ్ళింటిముందు జనం గుంపులు గుంపులుగా గుమికూడి వుండటం కన్పించింది. మామూలు చావుకి అంతమంది ముక్కూ మొహం తెలీనివాళ్ళు రారు. ఇది యాక్సిడెంట్! చాలామంది జాలికంటె కుతూహలంతో వచ్చి చూసివెళ్తారు.

అప్పటికే మలక్‌పేటలో వున్న ఆ అమ్మాయి తల్లిదండ్రులు, ఇంకా వూళ్ళో వున్న బంధువులు వచ్చారు. మరీ దగ్గర వాళ్ళు దిగులుపడి కూర్చుంటే, కొద్దిగా దూరపు బంధువులు ఓదారుస్తున్నారు.

అతని తరపువాళ్ళు విజయవాడ నుంచీ రావాలట. టెలిగ్రామ్ లిచ్చారు. తెల్లారేలోపు రావచ్చను కుంటున్నారు.

ఆమెకోసం చూశానక్కడ.

ఈ వార్త తెలియగానే స్పృహతప్పి పడిపోయిందట. ఇంకా స్పృహ రాలేదట. లోపల గదిలో పడుకోబెట్టారు— ఎవరో ఇంకెవరికో చెప్తుంటే విన్నాను. శవంమీద పూర్తిగా గుడ్డ కప్పేశారు ఇంక అక్కడ నిలబడలేకపోయాను ఇంటికొచ్చేశాను.

ఆ రాత్రి భోజనం చేయాలనిపించలేదు. మృణాళిని కూడా నాతోపాటే అలానే పడుకుంది.

కళ్ళు మూసుకుంటే చాలు అతని నవ్వు మొహం, వాళ్ళిద్దరూ సర్దాగా కబుర్లు చెప్పుకుంటూ వెళ్తున్నట్లు కన్పించసాగింది.

అంత బరువైన బస్సు చక్రాలు మీదెక్కితే ఆ మనిషి బాధతో ఎంతగా తన్నుకుంటాడు! అంత బాధాకరమైన ఆ క్షణంలో అతనికి తప్పక భార్య గుర్తొచ్చుంటుంది. తన శారీరక బాధకన్నా చివరి క్షణంలో ఈ బాధే ఎక్కువగా అనుభవించుంటాడు!

ఆమె ఈ షాక్ నుంచి తిరిగి కోల్కోగలదా?

ఒకవేళ కోల్కున్నా అతని జ్ఞాపకాల్తో పిచ్చిదైపోతుందేమో!

భగవాన్! ఏమిటయ్యా నీ లీల!

...ఆలోచనల్తో బుర్రవేడెక్కిపోయింది.

మనసు బాగా చికాగ్గా వున్నప్పుడు సిగిరెట్లెక్కువగా తాగుతుంటాను. అలా ఆలోచిస్తూ ఎన్ని సిగిరెట్లు తాగానో నాకు తెలీదు. పెట్లో సిగిరెట్లైపోయేసరికి అప్పుడనిపించింది 'అప్పుడే సిగిరెట్లైపోయాయా!' అని.

"ఇంక పడుకోండి రెండవుతోంది" నెమ్మదిగా అంది మృణాళిని. తనకీ నిద్ర పట్టడంలేదు. మా ఇద్దరికీకూడా ఇది పెద్ద షాక్!

మనసు బాగోనప్పుడు సిగరెట్లుండి తీరాలి. లేకపోతే మరింత అప్సెట్టైపోతాను.

"నువ్వు పడుకో నేనిప్పుడే వస్తాను" బయటికి బయల్దేరాను సిగిరెట్లకోసం.

"ఎక్కడికండీ?" కంగారుగా అడిగింది మృణాళిని.

"సిగిరెట్లు తెచ్చుకుంటాను" బయటికొచ్చేశాను.

ఆమె అప్పుడు వద్దనిగాని, మరేమన్నా అన్నాగాని వినేస్థితిలో లేను. ఆమెకూడా అనేస్థితిలో లేదేమో! మరేమీ మాట్లాడలేదు.

బర్కత్‌పురా చౌరాస్తాదాకా నడిచివెళ్ళి వో టీతాగి సిగిరెట్లు తెచ్చుకున్నాను.

ఏ పనిచేస్తున్నా నా ఆలోచన్లు వాళ్ళిద్దరి చుట్టూనే తిరగసాగాయ్!

ఆ రాత్రి అలాగే గడిచిపోయింది.

* * *

శారద కన్పించడం లేదు.

స్థలం మార్చాల్సిన అవసరం ఆమెకెంతైనా వుంది. లేకపోతే అతని జ్ఞాపకాల్నే గుర్తుకు తెచ్చుకుంటూ ఆమె కోలుకోలేదు. అందుకనే ఆమెని వాళ్ళ నాన్నగారింటికి తీసుకెళ్ళుంటారు కన్పించడం లేదు.

ఇప్పుడామె ఎలావుందో? ఆ మాట తల్చుకుంటేనే గుండెలు జలదరిస్తున్నాయ్!

తర్వాత తెలిసింది ఆ ఇంటిని ఖాళీ చేయించి ఆమెని మలక్‌పేటలోనున్న వాళ్ళింటికి తీసుకుపోయార్ట వాళ్ళ నాన్నగారు.

ఆ అఘాతం నాకు ప్రత్యక్షంగా తగిలిందికాదు కాబట్టి క్రమక్రమంగా బాధ మర్చిపోగల్గాను. కానీ అప్పుడప్పుడూ గుర్తొచ్చినప్పుడు మనసు కలుక్కుమంటూనే వుంది.

మామూలుగా ఆఫీసుకి బయల్దేరే టైమ్‌లో బయల్దేరితే వాళ్ళిద్దరూ గుర్తొస్తున్నారు అందుకని ఆ టైమ్‌కి కాస్త ముందే బయల్దేరడం ప్రారంభించాను. అదీగాకుండా బస్సుని శంకరమఠం దగ్గర కాకుండా నల్లకుంటలో ఎక్కడం మొదలుపెట్టాను.

రోజులు గడుస్తున్నకొద్దీ మనసులోని గాయం మానుపట్టం ప్రారంభించింది.

మృణాళిని సాహచర్యంలో బాధలన్నింటినీ దూరంగా తోసి ఆనందంగా పరుగులెడుతున్నాయ్ రోజులు. క్రమక్రమంగా నెలలుగా మారిపోతున్నాయ్!

ఆ రోజు ఆఫీసు నించీ ఇంటికొస్తూ అలవాటు ప్రకారం గడ్డయ్య షాపు దగ్గర ఆగాను.


మామూలుగా ఫోర్‌స్క్వేర్ సిగిరెట్లందించాడు.

నెలాఖరు రోజులు. అందుకని జేబులో నోట్లు లేవు. చిల్లర లెక్కబెట్టిచ్చాను.

మృణాళిని దగ్గర మరో వింత అలవాటుంది.

ఏదైనా నోట్ మార్చగా వచ్చిన చిల్లర్ని సూట్‌కేసులో అడుగున పడేస్తుంది. ఒక చోట గుర్తుగాకాదు— సూట్‌కేసులో బట్టలమధ్య, ఏదో ఒక మూల!

నెలలో మొదటి మూడు వారాలు డబ్బుకి పెద్దగా తడుముకోవల్సిన అవసరం వుండదు. ఆ తర్వాత సూట్‌కేస్ దులుపుతాం చిన్నా పెద్దా నాణెలు సందుల్లోంచి జారిపడుతూంటే నిధులు, నిక్షేపాలు దొరికినట్లే వుంటుంది నెలాఖరుకి ఆ చిల్లర



## కృష్ణార్జునులు కాబోతున్న గవాస్కర్-విశ్వనాథ్‌లు

భారత క్రికెట్ ఓపినింగ్ బ్యాట్స్‌మేన్ సునీల్ గవాస్కర్, అగ్రస్థాయి బ్యాట్స్‌మేన్ గుండప్ప విశ్వనాథ్ బావ బావమరుదులు కాబోతున్నారు. 1978 మార్చి 27వతేదీన గవాస్కర్ చెల్లెలు కవితా మనోహర్‌కి గుండప్ప విశ్వనాథ్‌కు వివాహమునిశ్చయమైంది. బొంబాయిలో ఈ వివాహము వైభవంగా జరుగుతుంది. విశ్వనాథ్ సంవత్సరంన్నర క్రితం నుంచి యీ ప్రయత్నంలోనే వున్నారు. కాని క్రిందటి సంవత్సరం అక్టోబరులోనే రెండు కుటుంబాల పెద్దల మధ్య అంగీకారం కుదిరింది.

గవాస్కర్‌ల కుటుంబానికి చేపలంటే ఇష్టం. విశ్వనాథ్ కుటుంబం గట్టి శాకాహారులు. విశ్వనాథ్‌కు చేపలంటే ఇష్టం వుండదు కాని తతిమ్మావాటిని ఎక్కువగా తింటూ వుంటాడు. విశ్వనాథ్ ఇంటిలో కవిత శాకాహారాన్నే వండాలి. శాకాహారిగానే వుండాలి. ఈ దంపతులు బయట తమ స్నేహితులతో మాత్రం మాంసాహారాన్ని భుజించవచ్చును!

నాణేలు మేమూహించనంత పెద్ద మొత్తాలై మమ్మల్నెంతో ఆదుకునేవి?

గడ్డియ్య చిల్లర తీసుకున్నాడు.

"దునియా ఎట్లా మారిపోయిందో చూశారాసార్?" అడిగాడు.

"ఏమైంది?" ఏదో చెప్పడాన్కి అతని ఉపోద్ఘాతం ఆ ప్రశ్న అంచుకే వెంటనే అసలు విషయం కోసం అలా అడిగాను. ఆ ప్రశ్న వెయ్యకపోతే ఉపోద్ఘాతం పెరిగిపోయే ప్రమాదముంది.

"ఆ యమ్మకి మళ్ళీ లగ్నంటగదా?"

"ఏ అమ్మకి?"

"ఆ యమ్మేసార్! ఆ పక్క గల్లీలో వుండేవారు సూడండీ! మొగుడు కాచీగూడ దగ్గర యాక్సిడెంట్లో పోయాడు... రోజూ పొద్దునా, సాయంత్రం ఇటుగానే వెళ్ళేవారు కదా సార్..."

షాక్ తగిలినట్లైంది.

ఆమె... ఆమె... శారద!

శారద...శారద...మళ్ళీ పెళ్ళి చేసుకుంటోంది!

ఛ...ఛ... అది జరగదు. ఇతను పొరబాటు పడుంటాడు. అతనే ఆమె ... ఆమే అతను! అతను పోయి ఇంకా సంవత్సరం కూడా కాలేదు. ఇంతలోనే ఆమె అతడ్నిమర్చిపోయి మరొకతన్ని వివాహం చేసుకోబోతోందా?

అసంభవం ...

ఇది నేనేకాదు- వాళ్ళతో పరిచయముండక్కర్లేదు వాళ్ళని చూసినవాళ్ళుకూడా నమ్మరు, నమ్మలేరు. —

# కొత్త జీవితం

నా మొహంలోని భావాల్ని చదివేసినట్టున్నాడతను

"నిజంగానే దొరా! ఆమెకి పెళ్ళంట! అతను రైల్వేలో పనిజేస్తున్నాడంట...వచ్చే బేస్తవారమే లగ్గం. బాలాజీ భవన్లోట. ఆమె తండ్రి వచ్చి ఇదివరకున్న ఇంటివాళ్ళని పిల్చివెళ్ళాట్ట. ఆయనొచ్చి సిగిరెట్లు కొంటూ మరొకాయనతో చెప్తుంటే నేను విన్నాను. నాకూ ఆమేనా? కాదా? అని అనుమానం వేసి అడిగాను. ఆమేనని చెప్పాడాయన! ఆయనే కాదు ఆమె పనిజేసే ఆఫీసులోనే పనిజేసె ఇంకొకాయన కూడా చెప్పాడీ విషయం. ఆయనకూడా మన కొట్టుకొస్తుంటాడు."

ఇక అక్కడ నిలబడలేకపోయాను.

'ఏ ఇంట్లో ఏం జరుగుతోంది? ఎక్కడ ఏమి విశేషం?- అని గ్రహించే తెలివితేటలు కొంతమందికె వుంటాయ్' నా మటుకు నాకా తెలివిలేదు ఆ విషయంలో గడ్డియ్య అపరిమితమైన తెలివిగలవాడు. ఆ ప్రాంతంలో ఏం జరిగినా అతనికి తెలియాల్సిందే!

...ఆ ప్రాంతంలోవున్న వాళ్ళ విషయాలే కాదు, ఇదివరకు వుండిపోయిన వాళ్ళ విషయాలుకూడా అతనికి ఖుణ్ణంగా తెలుస్తూ వుంటాయన్న విషయం అప్పుడే తెల్సింది!

అతను వ్యాపారంకోసం అక్కడ కొట్టు పెట్టాడా? లేకపోతే ఇక్కడుండే మనుషుల ప్రవర్తన గురించి తెల్సుకోడాన్కి బడ్డీ కొట్టు పెట్టుకున్నాడా? అనే అనుమానం ఇంతకుముందుకూడా ఎన్నోసార్లు వచ్చింది.

ఆసక్తిగా ప్రతీ విషయం గమనించడమే కాదు—అంత ఆసక్తిగా ఆ విషయాన్ని తన దగ్గరకి వచ్చిన వాళ్ళందరికీ చెప్తాడు!

దానివల్ల అతనికేమైనా లాభముందా?

ఏమో —!

అతను కాస్త చదువుకునుంటే మంచి విలేఖరైవుండేవాడు, లేకపోతే గొప్ప డిటెక్టివన్నా అయుండేవాడు!

— శారద పెళ్ళి!

మళ్ళీ పెళ్ళి చేసుకుంటోంది శారద!

అంత ప్రేమగా చూసుకునే భర్త చనిపోగానే ఆమె గుండెలు పగిలిపోతాయ్, ఇంక జీవితంలో ఆమెకు దుఃఖం తప్ప మరేమీ మిగల్లేదనుకున్నాడు!

ఆమె మొహంలో కుంకుమే కాదు చిఱునవ్వు కూడా శాశ్వతంగా చెరిగిపోయిందనుకున్నాడు!

'అతనింక తనకి కన్పించడు!' ఈ విషయం ఆమె మనసుని చెదరగొట్టేసి పిచ్చిదాన్ని చేస్తుందనుకున్నాడు. ఒకవేళ బాధ భరించలేక తనువు చాలించినా చాలిస్తుందనుకున్నాడు!

కానీ... కానీ...

ఆమెకి పిచ్చెక్కలేదు.

చనిపోలేదు.

సుబ్బరంగా అతన్ని మర్చిపోయింది!

మామూలుగా కే ఆఫీసుకెళ్తోందిట.

మరికొన్ని రోజులుపోతే విశ్వం స్థానంలో మరో మగాడ్నేసుకుని నవ్వుతూ, కిస్సుపడుతూ తిరుగుతుంది!

ఆమె గుండె పగిలిపోతుందనుకున్నాడు కాని కొత్త లయతో కొట్టుకుంటుందనుకోలేదు!

మొహానికి కుంకుమ పెట్టుకోబోతోంది.

ఈ వరస చూస్తుంటే పెదాలకి చిరునవ్వేకాదు లిప్‌స్టిక్ పులుముకున్నా ఆశ్చర్యపడనవసరములేదు!

ప్రేమ, అభిమానం, అనురాగం— ఆమె భాషలో వీటికర్థాలేంటో?

నిజజీవితంలో వాటికి నిజంగా స్థానం లేదేమో?

ఆమేకాదు- అక్కడ మరో ఆడమనిషున్నా అలానే చేస్తుందా...

ఏం ఆడవాళ్ళు!

'ఛా!' కసిగా వుమ్మేసి గుమ్మంలోకి అడుగు పెట్టాను.

అక్కడే తారట్లాడుతోంది మృణాళిని...

ఆమె నా కోసం అలా ఎదురు చూస్తుంటే రోజూలా ఆనందం, తృప్తి కల్గడంలేదు వైరాగ్యం, నిర్లిప్తత కల్గుతున్నాయ్!

ఒకవేళ నేను చనిపోతే మృణాళిని కూడా శారద లాగానే చేస్తుందా! శారదకిలా చేయడానికి దాదాపు సంవత్సరంకావల్సొస్తే ఈమె కెంతకాలం కావాలో ...? కనీసం సంవత్సరమన్నా ఆగుతుందా లేకపోతే ...

చిరాగ్గా వరండాలోవున్న పడక్కుర్చీలో కూలబడ్డాను. ఆలోచన్లెటెటో పరుగెడుతున్నాయ్...

మనిషి ప్రక్కనున్న న్నాళ్లేనేమో ఎవరికైనా ఈ ప్రేమలు, అభిమానాలూను!

మృణాళిని ఏదో అడగాలని దగ్గర కొచ్చింది.

కళ్లు మూసుకున్నాను.

మౌనం...

రెండు నిముషాలు గడిచిపోయాయి.

"ఇదిగోనండీ కాఫీ" కళ్లు తెరిచాను.

ఎంత దీక్షగా ఆమె మొహంలోకి చూసినా నాక్కనిపించింది అమాయకత్వం కూడిన ప్రేమే!

కాఫీ తాగకుండా గ్లాసుని పక్కనే పెట్టాను. మృణాళిని నయోమయంగా చూస్తోంది నా వంక. ఇంటికొచ్చి ఆమెని చూసింతర్వాత మనసింకా పిచ్చిగా అయిపోయింది.

ఈ అన్యోన్యత, ప్రేమ, అనురాగం — ఎన్నాళ్లు?

"కాఫీ తాగండి" నెమ్మదిగా అంది.

"మృణా! నో మాటడుగుతాను నిజం చెప్పు. నేను చచ్చిపోతే నువ్వు మళ్లీ పెళ్లి చేసుకోడానికి ఎన్నాళ్ల వ్యవధి కావాలి?" నా గొంతు నాకే భయంకరంగా వినబడుతోంది.

నిర్ఘాంతపోయింది.

"చెప్పు..." పెద్దగా అరిచాను.

"ఆ దౌర్భాగ్యుడు విశ్వంలేడూ...బస్సు కిందపడి చచ్చిపోయాడు ... వాడి పెళ్లాం మహాపతివ్రత, అనుకూలవతి! వాళ్లది గొప్ప ఆదర్శ దాంపత్యంలే! అందుకనే ఆ నిర్భాగ్యుడ్ని మనంకూడా ఇంకా మర్చిపోలేదు ఆమె మళ్లీ పెళ్లి చేసుకుంటోంది. మళ్లీ ఎదురుకోళ్లు, వేడుకలు, కన్యాదానాలు, అలక పాన్పులు, శోభనం రాత్రులూను.

చెప్పు, మృణా... రేపొకవేళ నేను చచ్చిపోయాననే అనుకో నువ్వు వెంటనే పెళ్లి చేసుకుంటావా?... అలాంటి వుద్దేశమే వుంటే ఇప్పట్నించే మరోవాణ్ణెవణ్నైనా నిర్ణయించి పెట్టుకో. శారదలాగా అన్నాళ్ళు వెయిట్ చెయ్యాల్సిన అవసరముండదు..." కర్కశంగా మనసులో లావాలాగా పొంగుతున్న భావాలన్నింటినీ బయటి కెళ్లగక్కేశాను.

ఒళ్లు వేడెక్కిపోయింది, జ్వరం వచ్చినట్లుంది.

"ఏమిటీ... శారదకి మళ్లీ పెళ్లా...?"

"ఏం... ఆశ్చర్యమేముంది? ఆ నాటక మైపోయింది. కొత్త నాటక మాడబోతోంది! అందులో విశ్వం హీరో. ఇందులో మరొకడు హీరో! మహా నటిలే! సీత, సావిత్రి, అనసూయ మొదలైన వాళ్లందరి వేషాలూ ఒకేసారి వేసేస్తుంది! మహా ఉదాత్తంగా నటించేస్తుంది... మంచినీళ్ళు తాగినంత తేలిగ్గా. న్యాలోజులాగాక మనమంతా చక్కగా మరో నాటకాన్ని చూడొచ్చు హోహో స్థలం మారిపోయింది కదూ! పోన్లే ప్రేక్షకులు కూడా మారిపోతారు. నా లాంటి మరి కొంతమంది వెధవలు థ్రిల్‌తో చూస్తారు, తరిస్తారు."

"కోపం తగ్గించుకుని సరిగ్గా చెప్పండి అసలేం జరిగింది?"

ఆవేశాన్ని చంపుకుని అతి బలవంతాన అంతా చెప్పేశాను.

"ఇప్పుడు చెప్పు మృణా! నిజంగా చెప్పు. నేను ఒకపోళ చచ్చిపోతే నన్ను వెంటనే మర్చిపోతావ్ కదూ? అప్పుడీ అభిమానం, ప్రేమ—ఇవన్నీ పిచ్చిగా అనిపిస్తాయి కదూ? నిజం చెప్పు..." మాటలు పెగలడంలేదు. కన్నీటి పొర కప్పేసి మృణాళిని మొహంలోని భావాలు సరిగ్గా కన్పించడం లేదు.

మృణాళిని మాట్లాడకుండా లేచి— వాకిలి తలుపేసి వచ్చింది. నన్ను లోపలికి తీసుకెళ్లి మంచంమీద పడుకోబెట్టింది. తను పక్కనే కూర్చుని నా తలమీద రాస్తూ—


"ఎంత సున్నిత మనస్కులండీ మీరు! దేవుడు మనల్ని చల్లగా చూస్తాడు. పదికాలాలపాటు హాయిగా వుంటాం. ఎవరో దురదృష్ట జాతకులకైనట్లు మన కెందుకు జరుగుతుంది? మీరు లేకుండా నేను ఒక్క క్షణం కూడా ఈ ప్రపంచంలో వుండలేను" ఆమె కళ్లవెంట కన్నీళ్ళు రాలి నా తలమీద పడ్డాయ్.

మనసులో ఎన్నో భయాలు, అనుమానాలు...


ఆలోచించలేక తలని ఆమె గుండెల్లో దాచుకున్నాను.

"నువ్వు లేకుండా నేనూ బ్రతకలేను మృణా..."

"నేను మాత్రం బ్రతగ్గలనా?" అంది మృణాళిని పమిట చెంగుతో నా మొహం తుడుస్తూ.



తక్కువ పొదుపు! ఎక్కువ బహుమతులు!!
విజయకృష్ణ సేవింగ్స్ & ఫైనాన్స్ (ప్రై) లిమిటెడ్ వారి
విజయలక్ష్మీ గ్రూప్ లో నేడే సభ్యులుగా చేరండి! మీ పొదుపునకు పూర్తి రక్షణ! మీ పేరుతో బ్యాంకు ఫిక్సెడ్ డిపాజిట్ సర్టిఫికెట్!
60 నెలలు డ్రాలలో పాల్గొని మీ అదృష్టం పరీక్షించుకోండి!
VKSF
రిజిష్టర్డ్ ఆఫీసు గుడివాడవారి వీధి, విజయవాడ-1 * బ్రాంచి ఆఫీసు చార్మినార్ క్రాస్ రోడ్, హైదరాబాద్.
నిరుద్యోగాన్ని పారద్రోలండి! ఏజంట్లుగా వెంటనే చేరండి!




# కొత్త జీవితం

ఆమె అలా లాలిస్తుంటే కన్నీళ్లు విపరీతంగా వచ్చేస్తున్నాయ్. మనసులోని భయాన్నంతా ఆమె దగ్గర అలా కన్నీళ్ళ రూపంలో బయటికి నెట్టేస్తూ ఓదార్పు పొందాను..

*   *   *

నా మనసుని పూర్తిగా చదివేయగలది కాబట్టే మృణాళిని అప్పట్నించీ నన్ను మరింత సున్నితంగా చూసుకోవడం మొదలు పెట్టింది.

ఆమె ఆదరణ, ఆప్యాయత నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఆమె సాన్నిధ్యంలో ఎంతో మానసికానందాన్ననుభవిస్తున్నాను.

జన్మ జన్మలకీ ఆమే నా భార్యగా కావాలి.

ప్రతి చిన్న విషయానికి అతిగా ఆలోచించి విపరీతమైన మానసిక క్షోభ ననుభవించే బలహీనత నాలో వుంది. అటువంటప్పుడు అమితంగా ఆదరించి వోదార్చే తోడు కావాలి. మంచిలోను, చెడులోను, సంతోషంలోనూ, దుఃఖంలోనూ మృణాళిని ఎంతో అండగా నిలుస్తుంది. అటువంటి భార్య దొరకడం అదృష్టం కాదామరి!

రోజులామె సాహచర్యంలో ఎంతో హాయిగా గడిచి పోతున్నాయి.

"సాయంత్రం ఆఫీసు నించీ పెందరాడే వస్తారు కదూ?"! ఆ రోజాఫీసుకి బయల్దేరుతుంటే అంది మృణాళిని.

ఆమెని కాసేపు వుడికించాలనిపించింది.

"లేదు ఇవాళ కొద్దిగా లేటవుతుంది. మా ఫ్రెండొకరు పార్టీ ఇస్తున్నాడు" అన్నానామెని చిలిపిగా చూస్తూ.

నా చూపులో ఆమె నన్ను చదివేసినట్టుంది.

"సర్లెండి. ఇవాళ రాత్రి మొదటాట సిన్మాకి నేను, రాణి వెళ్తున్నాం ... వంట వండేసే వెళ్తాను..."

నా గుండెల్లో రాయి పడింది. కొంప తీసి నే నన్నమాటలు నిజమనుకొని ఈమె పక్కింటి రాణితో సిన్మాకి చెక్కేయదుకదా!

"అబ్బే... వూరికే అన్నాను...మామూలుగానే వచ్చేస్తాను."

ఫక్కున నవ్వేసింది.

# న్యూట్రాన్ బాంబు వల్ల కణితి వ్యాధి

న్యూట్రాన్ బాంబు అతి ప్రమాద కరమైన వ్యాధిని వ్యాప్తిచేసే ఆయుధ మని సోవియట్ వైద్యశాస్త్ర పరిషత్ ఉపాధ్యకులు అలెగ్జాండర్ పావులోవ్, నొవోస్తి విలేఖరితో వ్యాఖ్యానించారు.

మానవుల్లో కణితి వ్యాధిని చికిత్స చేసే సామర్థ్యం న్యూట్రాన్ ధార్మిక శక్తికివుంది. కాని న్యూట్రాన్‌బాంబు యజమానులు దీనిని ఆయుధంగా రూపొందించారు. న్యూట్రాన్ బాంబు ప్రేలినప్పుడు విడుదలయ్యే న్యూట్రాన్లుదానివాతపడిన వ్యక్తుల్లో అతితీవ్ర ధార్మిక వ్యాధి సోకుతుంది. 'గామా' కిరణాలకన్నా దీని ప్రభావం చాలా ఎక్కువ.

ఈ న్యూట్రాన్ ధార్మికశక్తినుంచి రక్షణ ఏర్పాటు చేసుకోలేని అమాయిక ప్రాణులు ముఖ్యంగా ఈ సామూహిక విధ్వంసక న్యూట్రాన్ బాంబు వాత పడతారని ఎకడమిషియన్ పావులోవ్ పేర్కొన్నారు. న్యూట్రానులు సోకిన వారికి మరణం తప్పదు. యీ చావు గంటలా, రోజులా, వారాలా అన్నది ఏ మోతాదులో ధార్మికశక్తి సోకిందో దానిమీద ఆధారపడి వుంటుంది. మొదట మెదడు దెబ్బ తింటుంది. వాంతులు ప్రారంభమవుతాయి. కళ్లు తిరిగి పడిపోతారు. డీలాపడిపోతారు. ధార్మికశక్తి సోకినవారు 48గంటలలో మరణిస్తారు. ఒకవేళ ధార్మిక శక్తి ఎక్కువ మోతాదులో సోకితే చిన్న ప్రేవులు ముందుగా దెబ్బతింటాయి. అక్కడినుండి దీని ప్రభావం మెదడుకు వ్యాపించి మరణానికి దారితీస్తుంది. నీళ్ళ విరోచనాలు ప్రారంభమై శరీరంలో నీరు హరించుకు పోతుంది. న్యూట్రాన్ బాంబు ధార్మికశక్తి యొక్క అవశేషం తాకిడి నేలపై, భవనాలపై, ముఖ్యంగా లోహ పదార్థాలపై వుంటుంది. దీని మూలంగా, న్యూట్రాన్ ధార్మిక శక్తి సోకిన ప్రజలకు సకాలంలో సహాయం అందదని పావ్‌లోవ్ తెలియ జేశారు.

[సో. వా. సం.]

---

"నేనూ వూరికే అన్నాను. మీరు లేకుండా నేనెక్కడికైనా వెళ్తానుటండీ?"

నిజమే! నేను లేకుండా తనెక్కడికీ వెళ్లదు. ఆ విషయం తెల్సికూడా అనవస రంగా కంగారుపడి పోయాను.

"మాష్టారూ! మీరివాళ పెందరాడే వస్తే మనం బజారు వెళ్ళాలి.

"ఎందుకూ ?"

"బావుంది! రామాయణమంతా విని రాముడికి సీతేమవుతుంది అన్నార్ట వెనకటికి మీలాంటివారే ఎవరో! స్వామీ ఎల్లుండి మీ పుట్టినరోజు. ఇవాళ సాయంత్రమైనా గుడ్డలు తీసుకుని టైలరు కివ్వకపోతే ఎల్లుండికందవు."

"నా కిప్పుడు గుడ్డలెందుకు మృణా! సర్దాగా పుట్టినరోజు చేసుకోడానికి నే నేమైనా పిల్లాణ్ణా ?"

"అహా... కాదు ముసలాళ్ళు!" సీరియస్‌గా మొహం పెట్టేసింది. ఆమెనలా చూసేసరికి నవ్వాపుకోలేక పోయాను. గట్టిగా నవ్వేశాను.

"ఎందుకూ నవ్వుతారు?"

"నా ఇష్టం. నేను నవ్వుకోవడం ఎందుకో కూడా నీకు చెప్పాలా?" చిరు కోపాన్ని ప్రదర్శించాను.

"అక్కర్లేదులెండి. నాకేమీ చెప్పనక్క ర్లేదు. మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి" గిరుక్కున వెళ్ళి మంచంమీద పడుకుంది. కళ్లనీళ్లు బలవంతాన నొక్కిపడుతోంది. జాలేసింది.

"మృణా! నా సంగతి నీకు తెలీదా? సర్దాగా ఏడిపిస్తే అంత బాధపడిపోతా వెందుకు?" ఆమె పక్కనే కూర్చుని తల నిమురుతూ అన్నాను.

చెయ్యి నెట్టేసి పక్కకి తిరిగిపడుకుంది

"మృణా! ప్లీజ్... అలా వుండకు... నువ్వలా వుంటే నే నాఫీసు కెళ్లలేను..." నెమ్మదిగా ఆమె మొహాన్ని పక్కకు తిప్పు కున్నాను.

కిసుక్కున నవ్వేసింది.

కొంగుతో కళ్ళు తుడుకుంటూ లేచి కూర్చుంది.

చటుక్కున దగ్గరకి లాక్కున్నాను.

నా గుండెలమీద వాలిపోయింది.

"నామీద కోపం పోయిందా?" ఒక చేత్తో ఆమె నడుముని చుట్టేసి, మరో చేత్తో ఆమె తల నిమురుస్తూ అన్నాను.

"ఛ! మీమీద నా కోపమేమిటండీ?"

"కోపం కాకపోతే అలక...!"

"పోలేదు, పోదు" రక్కున నా నుంచి దూరంగా జరుగుతూ అంది.

"అదేంటి?"

"అదంతా నే చెప్పిన వాటికి 'యస్' అంటేనే..."

"చూడు మృణా! నువ్వన్నదాని కెప్పు డైనా 'నో' అన్నానా? మేడమ్! అయామ్ ఆల్వేజ్ ఎట్ యువర్ డిస్పోజల్" లేచి వినయంగా నించొని అన్నాను.

"సరే సాయంత్రం ఆరుగంటలకల్లా ఇక్కడుండండి: వెళ్ళండి ఆఫీసుకి" తనూ లేచి నుంచుని గంభీరంగా అంది. కానీ ఆ గంభీరమంతా చివరక్షరం నోట్లోంచి వచ్చి రాకముందే నవ్వుగా మారిపోయింది నేనూ నవ్వేశాను.

"మరి ఆఫీసుకి టైమైపోయింది వస్తా..." అద్దంలో మరోసారి చూసుకుని, తల చేత్తో సర్దుకుని బయల్దేరాను.

తనూ వాకిట్లోకి వచ్చింది.


ఆమెను వదలి వెళ్లాలంటే అడుగులు ముందుకు పట్టంలేదు. రెండడుగు లేసి వెనక్కి తిరిగాను.

ఆమె అక్కడే నించొని చెయ్యూపింది.

నేనూ చెయ్యూపి త్వరత్వరగా బయ ల్దేరాను.

కొంత దూరం పోయింతర్వాత గుర్తు కొచ్చింది గడ్డియ్య కొట్లో సిగరెట్లు కొన లేదని. ఒక్క క్షణం వెనక్కి రావాలనిపిం చింది కాని శంకరమఠం దగ్గర తీసుకో వచ్చు లెమ్మని నడక వేగం హెచ్చించాను.

(ఇంకా వుంది)



# కొత్త జీవితం

వేదగిరి రాంబాబు
మైనంపాటి భాస్కర్

*(గత సంచిక తరువాయి)*

"పర్సాగా ఏదైనా మాట్లాడక ఆ విషయం ఎందుకండీ... ప్లీజ్! టాపిక్ మార్చండి."

పిచ్చి జంటలు కనిపిస్తున్నాయి రోడ్డు మీద.

ఒకళ్ళ మనసులో రెండోవాళ్ళ మీద ఎంత ప్రేముంది? అదెంతకాలముంటుంది?

...ఈ ఆలోచన్లు మనసుని చికాకు పరుస్తున్నాయ్.

అటుగా వెళ్తున్న ఆటో ఎక్కి, కోఠీ జేరుకున్నాం.

లేత నీలం రంగంటే నాకేకాదు, తనకీ ఎంతో ఇష్టం! నా వంటిమీద ఆ రంగు బాగా నప్పుతుందంటుంది. అందుకే అదే రంగు బట్టలు తీసుకుంది నాకు. తనకి మాత్రం ఏ చీరా వద్దంది. బలవంతాన నీలంరంగు నైలెక్స్ చీర తీసుకున్నాను.

నీలంరంగు యూనిఫారంతో ఇంటికొచ్చి, చట్టా పట్టాలేసుకుని అలా బయల్దేరి సిన్మాచూసేయాలితామిద్దరూ— ఎల్లుండి!

ఆ విషయమే ఆమెతో అన్నాను.

నవ్వింది.

ఇద్దరం బయటికొచ్చి కామత్‌లో కాఫీ తాగి నెమ్మదిగా ఇంటికి జేరుకున్నాం.

పుట్టినరోజు జరుపుకునే అలవాటు నా కెప్పుడూ లేదు.

కానీ తప్పదు మృణాళిని చిన్నబుచ్చుకో కూడదు. ఆ రోజు ప్రోగ్రామంతా తనే ఫిక్స్ చేసింది. శలవు దొరక్కపోవడంతో అనుకున్న కార్యక్రమంలో చిన్నపాటి మార్పులు చేయాల్సొచ్చాయ్!

సరిగ్గా ఉదయం ఆరుగంటలకల్లా బల వంతాన లేపి కూర్చోబెట్టింది. కాలకృత్యాలు తీర్చుకునేలోపు కాఫీ సిద్ధం చేసింది. కాఫీ పుచ్చుకున్నానో లేదో—

"తలంటుకుందురుగాని లేవండి" దూసుకొచ్చింది.

తనే దగ్గరుండి స్నానం చేయించి, తల తుడిచింది. కొత్త బట్టలకి పసుపు రాసి తెచ్చిచ్చింది. ఆమె హడావుడి చూస్తుంటే నవ్వొచ్చింది.

"నేను బట్టలు కట్టుకోవాలంటే వెంటనే నువ్వు కూడా స్నానంచేసి, మొన్న మనం కొన్న చీర కట్టుకోవాలి" అన్నాను.

"ఇవాళ పుట్టినరోజు మీది! నాది కాదు."

"అయినా నువ్వు నా అర్ధభాగానివి. ఆ అర్ధ నలంకరించబోతే ఎలా?"

"మాటలు బాగా చెప్తా[రే]"

"నా మాటలే కాదు చేతలు కూడా బాగానే వుంటాయ్..."

"సర్లెండి మీతో వాదించలేను స్నానం చేసి వస్తాను" లోపలికెళ్ళిపోయింది

కొత్త బట్టలు వేసుకుని తిరిగి పేప రందుకున్నాను

దాదాపు పది ముప్పొలు గడిచాయ్

సాయంత్రం ఇంటి కొచ్చేసరికి రెడీగా వుంది మృణాళిని.

కాఫీ కార్యక్రమాన్ని ముగించుకుని ఇద్దరం బయల్దేరాం.

ఆఫీసుల్నుంచి ఇంటికి తిరిగొచ్చే వాళ్ళతోను, షాపింగ్ బయల్దేరిన వాళ్ళతోను, రిక్షాల్తోను, సైకిళ్ళతోను, ఆటోల్తోనూ — రోడ్డంతా చాలా రద్దీగా వుంది.

ఆ రద్దీలో కూడా పక్కన మృణాళినితో నడుస్తుంటే ఏదో ఆనందం, అనుభూతి!

చనిపోయిన విశ్వం, శారద గుర్తొచ్చారు.

ఇప్పుడామె శంకర్తో ఇలాగే తిరుగుతూవుంది. పాపం విశ్వం!

"ఏంటండీ ఆలోచిస్తున్నారు?" మృణాళిని పలకరింపుతో వులిక్కిపడ్డాను.


"అబ్బే.. ఏంలేదు. విశ్వం గుర్తొచ్చాడు. అతను బ్రతికున్నంతకాలం అతనే తప్ప తనకి వేరే ప్రపంచం లేనట్లు ప్రవర్తించిందామె. అతను పోయి సంవత్సరం కూడా కాకుండా మరొకరికి జీవిత భాగస్వామినై కూచుంది. బహుశా విశ్వానికి అలాగే ప్రేమ పంచుంటాడు! నిజంగా మనుషులెంత స్వార్థపరులు..."

"సరిపోయింది. మళ్ళీ ఆ పేపరందు కున్నారూ?" తలెత్తి చూశాను.

నీలం చీరలో ఆమె అందం మరింత వికసించింది. తలంటి పోసుకుని తడారడం కోసం వదులుగా వేసుకున్న జడ ఆమె మొహానికో వింత అందాన్ని తెచ్చింది.

ఈ అందం నాది!

రెప్ప వాల్చకుండా ఆమెకేసి అలాగే చూస్తూ కూర్చున్నాను.




"ఏంటి అలా చూస్తున్నారు" చిన్నగా నవ్వింది.

అలా చూస్తుంటే ఆమెని దగ్గరికి లాక్కోవాలని, ఏమేమో చేయాలనీ అనిపిస్తోంది

చటుక్కున వంగి పాదాలకు దణ్ణం పెట్టింది

ఆమె అలా తప్పకుండా చేస్తుందని ముందే ఊహించినా ఆ క్షణంలో చెప్పలేని మధురానుభూతికి లోనయ్యాను. భుజాలు పట్టుకుని పైకి లేపా నాప్యాయంగా.

ఆ కళ్ళల్లో ఆరాధన, ఆత్మీయత!

దగ్గరికి లాక్కుని హృదయానికి హత్తుకున్నాను!

అలా ఇద్దరం ఎంతసేపున్నామో తెలీదు—

"వదలండి మీకు టిఫిన్ తెచ్చిపెడ్తాను" నా చేతుల్లోంచి సున్నితంగా వదిలించుకుంటూ మృణాళిని అన్న మాటల్తో తిరిగి ఈ లోకంలో కొచ్చాను.

ఆమె లోపలికి వెళ్ళింది కుర్చీలో కూలబడ్డాను.

మధుకోణంలో రెండు ప్లేట్ల ఉప్మా, గ్లాసులతో వచ్చింది.

# కొత్త జీవితం

"రెండు ప్లేట్లు వద్దు" అన్నా నామె వంకే చూస్తూ.

అర్థం కానట్టు చూసింది.

"సరే అయితే ఒక పని చెయ్యి. ఆ ప్లేటుని పక్కన పెట్టు. ఇద్దరం ఈ ప్లేటులోనే తిందాం. ఇదైపోయిన తర్వాత ఆ ప్లేటు సంగతి చూద్దాం" అన్నా నెదురుగా టీపాయ్‌మీద పెట్టున్న ప్లేట్లకేసి చూస్తూ.

చిన్నగా నవ్వింది మృణాళిని.

ఇటువంటికన్నా నాక్కావల్సింది ఆ నవ్వు మొహమే!

"నోరు తెరవండి" స్పూన్‌తో ఒకగులాబ్ జాంని సగం చేసి నా నోటి కందించింది. మిగిలిన సగం నేనామె నోటికి అందించాను.

—ఇద్దరం నవ్వుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ ఆ రెండు ప్లేట్లనీ పూర్తి చేశాం. తర్వాత కాఫీ కార్యక్రమాన్నికూడా సంయుక్తంగానే దిగ్విజయంగా ముగించాం.

"ఇవాళొక్కరోజు నా మాటకి నువ్వేమీ ఎదురు చెప్పవద్దు" వంటపన్లో కూడా ఆమెకి చేతనైనంత సాయం చేశాను.

వంటైపోయింది.

కబుర్లు చెప్పుకుంటూ భోంచేశాం.

అప్పుడు గుర్తుకొచ్చింది ఆఫీసువిషయం వాచీ చూసుకున్నాను.

పది కావస్తోంది—

"మృణా! ఆఫీసు టైమైంది. మరి నే వస్తా తృప్తిగా ఆమె వంకే చూస్తూ అన్నాను.

"వీలైతే కాస్త ముందే వచ్చేయడానికి ప్రయత్నించండి" వక్కపొడందిస్తూ అంది

సిగిరెట్టు ముట్టించి "నాలుగ్గంటు కల్లా వచ్చేస్తా"నని చెప్పి బయల్దేరాను.

"సాయంత్రం మీరొచ్చేసరికల్లా వెజిటబుల్ బిర్యానీ రెడీగా వుంచుతాను" నా వెనకే గేటుదాకా వస్తూ అంది

ఆ రోజెందుకో మృణాళిన్ని వదిలి వెళ్ళాలంటే రోజకన్నా ఎక్కువగా దిగులేస్తోంది కాళ్ళు ముందుకు పట్టం లేదు. తప్పదు వెళ్ళితీరాలి.

మామూలే!

రెండడుగులేసి వెనక్కి తిరిగాను.

ఆమె అక్కడే నించొని చూస్తోంది.

వెనక్కి తిరిగి వెళ్ళిపోవాలనే కోరికని బలవంతాన అణచుకొని తిరిగి బయల్దేరాను.

సందు మలుపు తిరుగుతూ ఇంటికేసి చూశాను.

ఇంకా అక్కడే నిల్చొనుంది పిచ్చిమృణా!

టైమైపోవడంతో అటుగా పోతున్న ఆటోనాపి, ఎక్కాను.

ఆఫీసుకి చేరింతర్వాత కూడా మనసు పనిమీద సరిగ్గా లగ్నం చెయ్యలేకపోయాను. ఆలోచనస్తీ మృణాళిని మీదే!

సుమారు మూడు గంటల ప్రాంతంలో "మీ కోసం కుర్రాడెవరో వచ్చాడు" అంటూ వచ్చి చెప్పాడు ప్యూన్ పావయ్య.

నా కోసం ఈ సమయంలో ఇప్పుడొచ్చే కుర్రాడెవరు? అర్థంగాక కుర్చీలోంచి లేచి బయటికొచ్చాను.

శ్రీను!

అతను మా పక్కింటి వాళ్ళబ్బాయ్!

ఇతన్తో పెద్ద పరిచయం కూడా లేదు. మరి తన కోసం ఎందుకొచ్చాడు!

నన్ను చూడగానే గబగబా దగ్గర కొచ్చాడు.

అతని మొహంలో ఆందోళన కొట్టొచ్చినట్టు కనబడుతోంది.

"మీరు...మీరు...అర్జంటుగా వెళ్ళాం" కంగారుతో మాటలు కూడా సరిగ్గా రావడంలేదు.

"ఏం జరిగింది...? ఎందుకు...?" అయోమయంగా అడిగాను. మనసెందుకో కీడుని శంకిస్తోంది.

"మరి...అత్తయ్యగారేదో చేస్తుంటే ఇందాక...పొరబాటున చీరంటుకుంద...,,

అతను చెప్పేదేంటో వినబడ్డం లేదు.

గిరుక్కున వెనక్కి వెళ్ళి, ఆ విషయం సెక్షన్ హెడ్‌తో చెప్పి వెంటనే బయటి కొచ్చాను

"అమ్మావాళ్ళు అత్తయ్యగార్ని హాస్పిటల్‌కి తీసుకెళ్ళారు. అక్కడికెళ్దాం..." అయోమయంగా అతని వెనకే బయల్దేరాను.

భగవాన్!

ఏమిటీ శిక్ష!

మృణాళినికేమైనా జరిగితే... భరించలేను...

ఆమెను కాపాడే భారం నీదే...

"వళ్ళు బాగా కాలిందా?" ఆత్రంగా అడిగాను.

"బాగానే కాలింది. నేనొచ్చేప్పుడు స్పృహలో లేరు" బాధగా అన్నాడతను.

ఒకవేళ మృణాళిని...

మనసు మొద్దుబారి పోయింది.

అలా కొయ్యబారి పోయాను.

అక్కడ్నించి హాస్పటల్‌కి ఎలా జేరుకున్నామో, మృణాళిన్నుంచిన గదికెలా జేరుకున్నామో కూడా సరిగ్గా తెలీదు.

అప్పటికే ఆమె మీద పూర్తిగా గుడ్డ కప్పుండడం చూసేసరికి గుండె కొట్టుకోవడం ఆగిపోయి నట్లనిపించింది.

పక్కింటామె కన్నీరు తుడుచుకుంటూ పక్కకు తప్పుకుంది.

"మృణా... మృణా..." పిచ్చి వాడిలా ఏడ్చేస్తూ ఆమె శవం మీద పడిపోయాను.

ఆ తర్వాతేం జరిగిందో నాకు తెలీదు.

తిరిగి కళ్ళు తెరచేసరికి మా ఇంట్లో మంచంమీదున్నాను. వళ్ళు కాలిపోతుంది. తల పగిలిపోతోంది. చుట్టూ అమ్మా, నాన్న అన్నయ్య, వదిన- అందరూ నిలబడి ఆందోళనగా చూస్తున్నారు.

జరిగిందంతా జరిగిందని నమ్మబుద్ధి కావడం లేదు.

అదంతా కలకాకూడదూ—ఉహూఁ! నాలాంటి దురదృష్ట వంతుడికి అలాంటి కలలవవు.

ఇంతవరకూ నన్ను మించిన అదృష్ట వంతుడు లేడనుకున్నాను, కాని ప్రాణానికి ప్రాణమైన భార్యని పోగొట్టుకున్న నాకన్నా దురదృష్టవంతుడుండడు!

ఆరాత్రి టాక్సీలో మా వూరెళ్ళి పోయామంతా

మృణాళిని నన్ను వంటరిగా వదిలి వెళ్ళి పోయింది.

ఎక్కడికి వెళ్ళినా ఇద్దరంకల్సేవెళ్దామని చివరికి నన్నొంటరిగా వదిలి తనొక్కతే వెళ్ళి పోయింది. తను లేకుండా నే నెక్కడ ఎలా వుంటాననికూడా వూహించలేదు... ఊహూఁ ఊహించే ఉంటుంది... పోయే ముందు శారీరకంగానేగాక మానసికంగా కూడా చిత్రవధ ననుభవించుంటుంది.

ఇంక ఆ యింటికి వెళ్ళలేను... హైదరాబాద్‌లో వుండలేను.

మృణాళిని గుర్తుకుతెచ్చే చోటేదీ నేను భరించలేను... నా గుండె పగిలిపోతుంది, అవి జూస్తే.

రోజులు గడిచిపోతున్నాయ్.

శలవైపోయింది. తిరిగి హైదరాబాద్ వెళ్ళక తప్పలేదు.

నేనంతకు ముందెప్పుడూ చూడని ప్రాంతం, జన సమర్ధం ఎక్కువగా లేని ప్రాంతంచూసి ఇల్లు తీసుకున్నాను. అయినా గాని ప్రతిక్షణం మృణాళిన్ని గుర్తు తెచ్చుకోకుండా వుండలేకపోతున్నాను. ఏ జంటని చూసినా మృణాళినే గుర్తుకొస్తోంది. పొద్దున నిద్రలేచింది మొదలు తిరిగి రాత్రి నిద్రపోయేవరకూ ప్రతిక్షణం మృణాళినే కళ్ళముందు మెదుల్తోంది.

పిచ్చిగానీ తానే నేను, నేనే తానుగా మెలిగిన మృణాళిన్ని మర్చిపోవడం ఎలా సాధ్యం? సంవత్సరాలు కాదు యుగాలైనా ఆమెని తను మర్చిపోలేడు. తన గుండెల్లో ఎప్పటికీ చెరగని రూపాన్ని ముద్రించింది.

పగలంతా ఆఫీసులో అందరిమధ్యా ఎలా గోలా గడిపేస్తున్నాను. తీరా సాయంత్ర మయ్యేసరికి దుర్భరమైపోతోంది

ఆఫీసులోంచి బయట పడ్డాను.

నాకొద్దిగా ముందుగా శశి, ప్రసాద్ వెళ్తున్నారు.

వెంటనే మృణాళిని గుర్తొచ్చింది.

కళ్ళు నీళ్లతో నిండిపోయాయ్!

ఇంటికి వెళ్ళబుద్ధి పుట్టడం లేదు. తెల్సినవాళ్లెవరి దగ్గరికైనా వెళ్దామంటే మరీ చిరాకు—మృణాళిని ప్రసక్తి తెచ్చి సానుభూతి ప్రకటించాలని చూస్తుంటారు.

సినిమాకెళ్తే కనీసం రెండు గంటలైనా మనసుని మరోదోవ పట్టించవచ్చు-

దగ్గర్లోవున్న సినిమాహాలు కెళ్ళి, ఏ సినిమా ఆడుతోందో కూడా తెల్సుకోకుండా — టిక్కెట్టుకొని సరాసరి హాల్లోకి వెళ్ళి కూర్చున్నాను.

లోపలనేక జంటలు...


సర్దాగా కబుర్లు చెప్పుకుంటూ సినిమా చూచి ఆనందించడానికి వచ్చారు. తనేమో బాధని మర్చిపోడానికి సినిమాకొచ్చాడు. అలా వాళ్ళని చూస్తుంటే మర్చిపోవడం మాటటుంచి, మరిన్ని జ్ఞాపకాలు మనసునిముసిరి బాధపెడుతున్నాయ్!

లేచి బయటికొచ్చేద్దామనుకున్నాను.

ఇంతలో లైట్లారి పోయాయ్. సినిమా మొదలైంది.

...ఆ సినిమా కధ కూడా భార్యా భర్తల అన్యోన్య జీవితానికి సంబంధించిదే!

బయటికొచ్చేశాను.



పూర్తిగా చీకటి పడిపోయింది. నా జీవితం ఎప్పుడో చీకట్లో పోయింది! నెమ్మదిగా ఆలోచిస్తూ బయల్దేరాను.

అబిడ్స్ చేరుకున్నాను.

కాఫీ త్రాగుదామని ఎదురుగావున్న హోటల్ కేసి నడిచాను. అక్కడా జంటలు!

గబుక్కున ఓ గుక్కెడు కాఫీని చేదు విషంలా మింగి బయటికొచ్చేశాను.

హు! ఎంత మార్పు!

ఆఫీసొదలగానే సరాసరి ఇంటికెళ్ళిపోయేవాడు. ఒక్కక్షణం ఆలస్యమైనా తల్లడిల్లిపోయేది మృణాళిని. తనని చూడగానే ఆమె మొహం ఆనందంతో విప్పారేది. ఇద్దరూ సర్దాగా కబుర్లు చెప్పుకుంటూ కాఫీ త్రాగేవారు

ఎంత చక్కటి అనుభూతి!

మరిప్పుడు?

ఇలా రోడ్లు వెడతిరుగుతూ హోటళ్ళ మద్య తిరుగుతున్నాడు!

—కిల కిల నవ్వుకుంటూ ఓ జంట పక్కనించి వెళ్ళిపోవడంతో ఈ లోకంలోకి వచ్చాను.

ఇప్పుడెంత ఆనందంగా వున్నారో ముందంత బాధపడాలని వాళ్ళకి తెలీదు. తెలిస్తే ఇలా అనుబంధం పెంచేసుకోరు!

వాళ్ళకేసి పరీక్షగా చూశాను.

ఆమె...ఆమె...అచ్చం మృణాళినిలాగానే వుంది. అదే పర్సనాలిటి!...

పిచ్చెక్కిపోయినాబాగుండు. అప్పుడే తనకీ ఆలోచనలించి విముక్తి!

ఇప్పుడింటికెళ్ళి ఏంచేయాలి?

మనసు పరి పరి విధాలా పోతోంది.

చివరికో నిశ్చయాని కొచ్చాను.

సరాసరి ఓ బార్‌లోకెళ్ళాను. నాలాంటి వాళ్ళే ఉంటుకుంటాను అక్కడ చాలా మందున్నారు.

వాళ్ళందరూ నాలాంటివాళ్ళే ఎందుకవుతారు? కొందరు సర్దాకోసం వచ్చినవాళ్ళు, కొందరు అలవాటుగా వచ్చినవాళ్ళు... ఇలా వుండుంటారు! తనలాంటి నిర్భాగ్యులు ఇక్కడేకాదు ఎక్కడా వుండరు వుండ కూడదు కూడాను.

"ఏం తెమ్మంటారు" బేరర్ వచ్చాడు.

"ఏమేం వున్నాయ్?" అతను నా వంక విచిత్రంగా చూశాడు 'బహుశా! వీడెవడో కొత్త మొహంలా వున్నాడే!' అనుకొనుంటాడు.

అతను చెప్పిన పేర్లలో నాకు తోచిందేదో చెప్పాను.

తెచ్చాడతను. రెండు సోడాలు, ఐసు, గ్లాసు కూడా తెచ్చి టేబుల్ మీద పెట్టాడు.

కొద్దిగా మందుని గ్లాసులోకి వంపుకున్నాను.

అతను సోడా ఓపెన్ చేశాడు.

సోడాని గ్లాసులోకి వంపుకున్నాను.

తాగబోయాను...

హఠాత్తుగా మృణాళిని గుర్తుకొచ్చింది.

"తాగేవాళ్ళంటే నాకసహ్యం..."

ఒకసారి తాగుడు వసహ్యించుకుంటూ ఆమె అన్న మాటలు టక్కున గుర్తుకొచ్చాయ్.

'మీరు తాగడం కూడా మొదలు పెట్టారా?' దీనంగా ఆమె నావంకే చూస్తున్నట్లనిపించింది.

చటుక్కున గ్లాస్ టేబుల్ మీద పెట్టేసి నిల్చున్నాను.

బేరర్ నాదగ్గరకి పరుగెత్తుకొచ్చాడు.

"బిల్లెంత?" అడిగాను.

"మరి..." బల్లవంకే చూస్తూ నీళ్ళు నమిలాడు.

"పర్లేదు...చెప్పు."

చెప్పాడు.

## యువతరం

స్వా తకోత్తర విద్యాకేంద్రం అంటే పి.జి. సెంటర్‌లు! అనంతపురంలోగల స్నాకో.వి.కేంద్రంలో ఎమ్.కామ్ లో ఈయేడాది చేరిన కుమారి సురభి శైలజ హాబీలు సంఘసేవచేయటం— టేప్‌రికార్డింగూనట (సంఘసేవని టేప్ రికార్డ్ చేస్తుందను కోవద్దు) అయితే ఆశయం మాత్రం లెక్చరర్‌లేదా ఓ పెద్ద ఆఫీసర్ అవడం— వి.శైలజ సినిమాలు చాలా కొంచెం చూస్తుంది. లైబ్రరీకి వెళ్ళినా నవలలు మాత్రం చదువదు (డబుల్ ఆశ్చర్యార్ధకాలుండాలిక్కడ) ఇంత విన్నాక నీకు సినిమా తారని చూడాలనుంటుందా? అని అడక్కూడదు కాని— అయినా వెరిఫికేషన్ కోసం అడిగితే 'అభిలాష'లేదు పొమ్మంది— టేప్‌రికార్డింగ్ హాబీకి సరియైన కనక్షన్ ప్రశ్నాపత్రంలోని 7వ ప్రశ్నకి జవాబుగా దొరికింది. అది ఏమన యం.యస్ సుబ్బులక్ష్మి బాలమురళీ కృష్ణగాన మాధుర్యం గ్రోలుట యిష్టం— అయితే సరదాకి పేకాటకూడా



## కొత్త జీవితం

బిల్లు చెల్లించి బయట పడ్డాను.

మృణాళిని శారీరకంగా నన్ను విడిచి పెట్టిపోయినా మానసికంగా నన్ను వెంటాడుతూనేవుంది. ఆమెకి నచ్చని విషయాన్ని నేను చెయ్యలేను.

సిగరెట్టు మీద సిగరెట్టు కాలుస్తూ పిచ్చివాళ్ళా రోడ్ల వెంట తిరగసాగాను. ఎక్కడెక్కడ తిరుగుతున్నానో కూడా అర్ధం కావడం లేదు. కాళ్ళు పీకుతున్నాయ్! అయినా తిరుగుతూనే వున్నాను.

"ఏమండీ!" పిలుపుతో టక్కునాగిపోయాను.

గుమ్మంలో నిలబడుందామెవరో! అంత కన్నా మరెవరూ కన్పించలేదు నన్ను కాదే మోననుకొని తిరిగి బయల్దేరాను

"ఏమండీ!" మళ్ళీ అదే పిలుపు

అప్రయత్నంగా అటుకేసి నడిచాను.

వస్తున్న నన్ను చూస్తూనే ఆమె లోపలి కెళ్ళి పోయింది. ఆమె వెనకే నేనూ వెళ్ళాను.

అదో చిన్నగది—

వస్తువులన్నీ చిందర వందరగా వున్నాయ్. ఓ మూల మంచం వాల్చుంది. దానిమీద తెల్లటి దుప్పటి...

లిస్టులో చేర్చాలి వాలీబాల్, బాడ్‌మింటన్ ఆటలు చూడటం సర్దా. ప్రొహిబిషన్ ఎత్తి వేస్తే మంచిది లేనిపోని అల్లర్లు ఎందుకు?" అన్నది- అదే ప్రొహిబిషన్ ఎక్కడుంది ప్పుడు ? ఎత్తివేయడానికి అనడిగితే బహుశ మద్రాసులో అని చెబుతుందేమో... రోజూ రాకపోకలకి ఏ వాహనం ? అన్న విషయంలో శైలజ మాటల్లోనే యిలా వుంది సమాధానం "నేను 'మోపెడ్'లో వెళతాను ఎప్పుడన్నా కారు, స్కూటర్ డ్రైవ్ చేయ గలను కాని ఎక్కువగా నడిచే వెళతాను"– మదనపల్లి కాలేజీలో చదువుకున్న యీ అమ్మాయికి అబ్బాయిల్ని సరదాగా ఆట పట్టించడం యిష్టమేగాని ఆ[illegible] వాళ చేత భంగపడదు. "సోషల్ [illegible]" కావటం యిష్టమే– ఏమైనా అందువల కష్టంవస్తే తప్పించుకోడం తెల్సు ఆవి

ధైర్యంగా చెప్పింది– అయితే రూపాయి చిల్లర కోసం 'వక్కపొడి' అహహః... కొదుకాదు చాక్‌లేట్‌లు కొంటుందితప్ప మిఠాయి మాత్రం కొనుక్కోదు !

ఇందిరమ్మ మీద అభిప్రాయంకూడా చెప్పింది. "పాపం ! ఆమె చాలా మంచిది సార్ !"-(మరి కానివాళ్ళెవరో...)

ఇక తిండి అలవాట్లా ? – చాక్‌లేట్‌లు తింటే లావెక్కిపోతాననుకుంటే– సాయంకాలం పూట చపాతీలు తింటుంది కనుక–ఆ[illegible]రాదు... ఇక పెళ్ళి వర [illegible]లాంటి వాటి మీద "పెద్ద ఆఫీసర్‌ని ఆవుదామనుకుంటున్న యీ ఎమ్. కామ్. [illegible]"ని ఎలా అడుగుతాం? అంచేత బారియ బ్యాంకులో సురభి శైలజ రెండేళ్ళ తర్వాత ఉద్యోగం సంపాదించాలని ఆశీర్వదించాలి.

★★★

# కొత్త జీవితం

"కూర్చోండి. అలా [illegible]చున్నారే !" తలుపు లోపల గడియవేస్తూ అందామె.

గుండెలు జల్లుమన్నాయ్ !

అప్పుడర్థమైంది నేనెక్కడికి వచ్చానో!

అదేంటి ! ఇక్కడికెందు కొచ్చాను ? ఆమె పిల్వగానే ఇలా వచ్చేశానేంటి ?...

"కూర్చోండి" చేతులు పట్టుకులాగింది.

అప్పటికి పూర్తిగా ఈ లోకంలోకి వచ్చాను.

జేబులోంచి ఓ పదిరూపాయల కాగితాన్ని తీసి ఆమె మీదకి విసిరేసి, తలుపు తీసుకుని గబగబా బయటి కొచ్చేశాను.

తల దిమ్మెక్కిపోయింది

'ఛీ !ఛీ ! ఎంత పతనమై పోతున్నాను ! చివరికిలాంటి కొంపలచుట్టూకూడా తిరుగు తున్నాను !...'

వెంటనే ఆటోలో ఇంటికొచ్చేశాను.

తాళంతీసి లోపలికి అడుగుపెట్టగానే నవ్వుతున్న మృణాళిని ఫొటో కన్పించింది. వెంటనే కళ్ళు నీళ్ళతో నిండాయ్ !

'నన్ను క్షమించు మృణా ! ఇవాళ నువ్వు క్షమించలేని తప్పు చేశాను. తాగాలనుకున్నాను చివరకి వ్యభిచరించాలనికూడా అనుకున్నాను కానీ ఏపనీ పేనిష్టపూర్వకంగా చెయ్యలేదు. ఏం చేస్తున్నానోకూడా తెలీని పరిస్థితుల్లో అలా చేశాను. నిన్ను మర్చిపోయి, నీ మీద గౌరవంలేకాకాదు నిన్ను మర్చిపోవాలని, మర్చిపోలేక...' బోరున ఏడ్చేశాను. అలాకాసేపే డ్చేంతర్వాతకాని మనసు కొద్దిగానైనా కుదుటపళ్ళేదు. చాలా సేపు లైటుతీసేసిఅలా చీకట్లోనే కూర్చున్నాను.

లేచి సిగరెట్టు వెలిగించాను.

ఎన్ని రాత్రులిలా చీకట్లో కూర్చుని ఒంటరిగా మృణాళిన్ని తల్చుకోవడం ? నాకు తోడల్లా సిగరెటొక్కటే – అప్పుడు, ఇప్పుడు, ఏప్పుడూ నాతనే వుంటోంది ! ఖచ్చితంగా నేనీలోకం విడిచి పెట్టేంతవరకూ నాకు తోడుగానే వుంటుంది !

మృణాళినితో వున్నప్పుడు సిగరెట్టు తక్కువ–

ఇప్పుడెక్కువ–అంతే తేడా !

సిగరెట్టయిపోయింది.

దాన్నిపారేసి మరో సిగరెట్ వెల్గించాను. అలా ఆలోచిస్తూనే కూర్చున్నాను.

ఆలోచిస్తూనే సిగరెట్ నోట్లో పెట్టుకొని గట్టిగా పీల్చాను. పొగరాలేదు. ఊహూఁ ! సిగరెట్టెప్పుడో అయిపోయినట్లుంది. ఫిల్టర్ వరకూకాలి ఆరిపోయింది. విసిరి పారేశాను. అదే జేబులో ఆఖరి సిగరెట్టు: అర్జంటుగా మరో సిగరెట్టు కావాలిప్పుడు.

ఈ అర్ధరాత్రి సిగరెట్టు కావాలంటే రెండు ఫర్లాంగులు నడవాలి.

తప్పదు–

లేచి బయల్దేరాను.

రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది. ఒంటరిగా నడుస్తున్నాను మరో సిగరెట్టు సాహచర్యంకోసం.

హఠాత్తుగా ఆలోచన వచ్చింది నాకు–

అంతవరకూ పొగ పీల్చిన సిగరెట్టు పోగానే విసిరి పారేశాను. మరో సిగరెట్టు కోసం వెదుకుతున్నాను. మరిప్పుడు పాత సిగరెట్టు గుర్తుకు రాదేం ? దాన్ని గురించి బాధ కల్గదేం ?

జీవితానికి అర్థం కూడా ఇదేనా ? జరిగి పోయిందాన్ని మర్చిపోయి 'కొత్తవి' వెదుక్కుంటూ వెళ్ళడమేనా ?

శారద గుర్తు కొచ్చింది. ఆతను చనిపోయింతర్వాత ఆమె తిరిగి వివాహం చేసుకోబోతోందని తెల్సిన ఆ రోజు ఆమె గురించి ఎంత చెడుగా అనుకున్నాడు తను. అసలు స్త్రీనే నమ్మకూడదనుకున్నాడు. అంతకుముందు ఆమె భర్త మీద చూపించిందంతా నటననుకున్నాడు. కానీ ఇప్పుడు తెలుస్తోంది. పాత జీవితాన్ని మర్చిపోవడానికి 'కొత్తజీవితా'న్ని ఎన్నుకొందామె !

కానీ తనేం చేశాడు ?

మృణాళిన్ని మర్చిపోవడానికి తాగబోయాడు. వ్యభిచార గృహంలోకూడా వెళ్ళాడు ! ఇదికాదు నూతన జీవితానికర్థం. చిన్నతనంలోనే జీవిత భాగస్వామిని పోగొట్టుకున్న తన లాంటి దురదృష్టవంతులకి సరైన సాహచర్యం కావాలి.

ఆ సాహచర్యంలోనే దుఃఖ పూరితమైన గతాన్ని మర్చిపోవాలి. మరో జీవితాన్ని నిర్మించుకోవాలి.

(అయిపోయింది)

స్నేహానికి నిర్వచనమైన
స్నేహితులు శ్రీ 'అదివిష్ణు'కి
కృతజ్ఞతలతో– రచయితలు.